ప్రజాశక్తి
శుక్రవారం 16 మే 2025
8 పేజీలు




విశాఖపట్నం



అనకాపల్లి

బడులను బలహీనపరిచేందుకే..

◆ 9 రకాల పాఠశాలలుగా విభజన ◆ ఈ విద్యా సంవత్సరం నుంచే అమలు
◆ విద్యా వ్యవస్థను పునరుద్ధరిస్తామన్న బాబు హామీ బుట్టదాఖలు



ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేసిన జిఒ 117ను రద్దుచేసి, అంతకుముందున్న విద్యా వ్యవస్థను పునరుద్ధరిస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. ఆయన అధికారం లోకి వచ్చిన తరువాత ఆ జిఒను రద్దుచేయకపోగా దానికి ప్రత్యామ్నాయంగా జిఒ 19, 20, 21 తీసుకొచ్చి తొమ్మిది రకాల పాఠశాలల వ్యవస్థను కూటమి ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ప్రత్యామ్నాయ జిఒలతో గతంలో ఉన్నత పాఠశాలల్లో విలీనమైన తరగతులను వెనక్కు తీసుకొచ్చే అవకాశం లేదని స్పష్టమైంది. రానున్న విద్యా సంవత్సరం నుంచి తొమ్మిది రకాల బడులతో కూడిన విద్యా విధానం అమల్లోకి రానుంది. నూతన విద్యా విధానం ప్రకారం జిల్లాలోని పాఠశాలలను విభజించి ఫౌండేషన్ పాఠశాలలు 151, బేసిక్ ప్రాథమిక పాఠశాలలు 764, మోడల్ ప్రాథమిక పాఠశాలలు 187, ప్రాథమికోన్నత పాఠశాలలు 55, ఉన్నత పాఠశాలలు 145, ఉన్నత ప్లస్ బేసిక్ పాఠశాలలు 78, ఉన్నత ప్లస్ మోడల్ పాఠశాలలు 18గా ప్రభుత్వం ఏర్పాటు చేసింది.

జిల్లాలో గత ప్రభుత్వం 19 ప్రాథమిక పాఠశాలలను ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేసింది. 229 ప్రాథమిక పాఠశా లలను ఉన్నత పాఠశాలల్లోనూ, 28 ప్రాథమికోన్నత పాఠశాలలను ఉన్నత పాఠశాలల్లోనూ విలీనం మిగతా 2లో..

గందరగోళపరచడమే..



తొమ్మిది రకాల బడులుగా విభజించడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు గందరగోళానికి గురవుతారు. ఒకటి నుంచి ఐదు తరగతులు చదువుతున్న ప్రతి పాఠశాలలోనూ ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20 వుండాలి. మోడల్ ప్రైమరీ స్కూల్‌లో హెచ్‌ఎంలుగా స్కూల్ అసిస్టెంట్‌లను నియమించడం మంచిదికాదు. మోడల్ ప్రైమరీ స్కూళ్లలో ఎస్‌జిటిలను నియమించాలి.

గొంది చినబ్బాయ్,
యుటిఎఫ్ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి



అప్పలరాజు స్మారక స్థూపం ఆవిష్కరణలో వి.శ్రీనివాసరావు, కె.లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

చిరస్మరణీయుడు అప్పలరాజు

సంస్మరణ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, వేపగుంట విలేకరి

కార్మిక నేత జి.అప్పలరాజు 1990 నుంచి పెందుర్తి ప్రాంతంలో ఎర్ర జెండా నీడన ఎన్నో భూ పోరాటాలు నిర్వహించి ప్రజల మదిలో చిర స్థాయిగా నిలిచారని, ఆయన ఆశయ సాధనకు కార్మిక నగర్ ప్రజలంతా కృషి చేయడమే నిజమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. పెందుర్తి మండలం కార్మిక నగర్‌లో సిపిఎం ఆధ్వర్యాన గురువారం సాయంత్రం అప్పలరాజు సంస్మరణ సభ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.జగన్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కార్మిక నగర్ ప్రజలు ఏర్పాటు చేసిన అప్పలరాజు స్మారక స్థూపాన్ని వి.శ్రీనివాసరావు, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఆవిష్కరించారు. తొలుత అప్పలరాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. సంస్మరణ సభలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ స్థూపం అప్పలరాజు జరిపిన ఎర్రజెండా పోరాటాలకు శాశ్వత రూపమని కొనియాడారు.. ఈ ప్రాంతంలో ఇళ్లు వేయించి పట్టాలు సాధించే వరకూ అహర్నిశలూ ఆయన అనేక పోరాటాలు చేశారన్నారు. నేటి ప్రభుత్వాలు పేదలకు దక్కాల్సిన భూములను పల్లెంలో పెట్టి పట్టణాలు, నగరాల్లోని కార్పొరేట్లకు ఫలహారంగా మిగతా 2లో..

పిడుగుపాటుకు 30 మూగజీవాలు మృత్యువాత

▶ వార్త 8లో..

20 రోజులుగా అంధకారంలోనే..

▶ వార్త 8లో..

రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాల్సిందే.!

▶ వార్త 8లో..

దిగంబర దొంగ అరెస్టు

కీలక కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రాత్రిపూట దిగంబరంగా తిరుగుతూ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్టు క్రైమ్ ఎస్ఐ ఎం.అప్పలరాజు తెలిపారు. ఆయన కథనం మేరకు.. ఎంవిపి సెక్టార్ - 6లో నివసించే బి.విశ్వసాయి ఈ నెల 11న ఇంటికి తాళం వేసి ఊరెళ్లాడు. 14న తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం తెరిచి ఉంది. వెంటనే ఇంటి వద్ద ఉన్న సీసీ టీవీని పరిశీలించగా 12వ తేదీ అర్ధరాత్రి 1:15 సమయంలో ఒక వ్యక్తి పూర్తి నగ్నంగా ఇంటిలోకి ప్రవేశించినట్టు గుర్తించాడు. ఈ ఘటన జరిగిన సమీప ప్రాంతంలోనే నివసించే సిద్ధార్థ గుప్తా 11వ తేదీ ఉదయం ఇంటికి తాళం వేసుకొని పూర్ణా మార్కెట్ సమీపంలోని తమ బంధువుల ఇంటికి వెళ్లాడు. 14న ఇంటికి వచ్చి చూడగా తాళం విరగొట్టి ఉంది. సిసి టీవీ ఫుటేజీని పరిశీలించగా ఒక వ్యక్తి 12వ తేదీ అర్ధరాత్రి ఒంటి మీద బట్టలు లేకుండా ఇంట్లోకి చొరబడి రూ.3500 నగదును దొంగతనం చేశాడు. ఈ దొంగతనాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. దొంగతనం వీడియోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. దీంతో నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ద్వారకా క్రైమ్ సిఐ వి.చక్రధరరావు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఆ బృందం విజయనగరం జిల్లా కొత్తవలస ప్రాంతానికి చెందిన పాత నేరస్తుడు వడ్డాది విజయ్ అలియాస్ పొట్టి విజయ్ అలియాస్ విజయ అధికారిని గురువారం మధ్యాహ్నం ఎంవిపి సెక్టార్ - 12 సమీపంలో అరెస్టు చేసింది. అతనిపై ఇప్పటికే ఎంవిపి స్టేషన్‌లో సస్పెక్ట్ షీట్ ఉందని, 2004 నుంచి దొంగతనాలకు పాల్పడుతున్నాడని ఎంవిపి ఎస్ఐ అప్పలరాజు తెలిపారు. ముద్దాయి దొంగతనాలకు పాల్పడేటప్పుడు పూర్తిగా నగ్నంగా లేదా మిగతా 2లో..

జులై 5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి విశాఖపట్నం జిల్లా పరిధిలోని అన్ని న్యాయ స్థానాల్లో జులై 5న జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి చిన్నంశెట్టి రాజు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యాయ స్థానాల్లో ఉన్న పెండింగ్ కేసులు, సివిల్, చెక్ బౌన్స్, బ్యాంకింగ్, మోటార్ ప్రమాదాల నష్ట పరిహారాల కేసులు, సెక్షన్ 138 నెగోషియబుల్ ఇన్స్ట్రుమెంట్స్ చట్టం కేసులు, బ్యాంకు, మనీ రికవరీ కేసులు, ల్యాండ్ అక్విజిషన్ కేసులు, కార్మిక, కుటుంబ తగాదాలు (విడాకులు కేసులు కాకుండా), పారిశ్రామిక వివాదాలు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులను ఈ లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, న్యాయ సేవా సదన్, విశాఖపట్నంలో లేదా 0891 - 2560414, 2575046 ఫోన్ నెంబర్లను, మండల న్యాయ సేవా సంఘాలను సంప్రదించాలని కోరారు.

యోగా వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

జిల్లా కలెక్టర్ హరేంధిర ప్రసాద్



మాట్లాడుతున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జూన్ 21న విశాఖ వేదికగా 'యోగా ఫర్ ఆన్ ఎర్త్, ఆన్ హెల్త్' థీమ్‌తో జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. వేడుకల నిర్వహణ, మైదానాల గుర్తింపు, మౌలిక వసతుల కల్పన, టీవీ స్క్రీన్ల ఏర్పాటు, రవాణా, తాగునీటి సదుపాయంతో పాటు ఇతర ఏర్పాట్లు గురించి కలెక్టరేట్ మీటింగు హాలులో వివిధ స్థాయిల అధికారులతో గురువారం ఆయన సమీక్షించారు. జూన్ 21వ తేదీ ఉదయం 6 గంటల నుంచి 8 గంటల మధ్యలో సుమారు 45 నిమిషాల పాటు కార్యక్రమం జరగనుందని, జిల్లా వ్యాప్తంగా గుర్తించిన ప్రాంతాల్లో పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు, యోగా అభ్యాసకులు, ఉద్యోగులు, సాధారణ పౌరులు, డిఫెన్స్ స్టాఫ్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, క్రీడాకారులు, ఇతర సంస్థల కార్యకర్తలు తదితరులు సుమారు 2.5 లక్షల మంది భాగస్వామ్యమయ్యేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. 24 చదరపు అడుగులకు ఒకరు చొప్పున కూర్చునే విధంగా ఏర్పాట్లు ఉండాలని, నోడల్ అధికారులు కీలకంగా వ్యవహరించాలని, కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసుకోవాలని మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

బడులను బలహీనపరిచేందుకే..

చేసింది. తరగతులు, పాఠశాలల విలీనంతో విద్యార్థులకు బడులు దూరమయ్యాయి. సమీపంలో పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో పేద విద్యార్థులు కొందరు పాఠశాలలకు దూరంకావడం, కొందరు దగ్గరలోని ప్రయివేటు పాఠశాలలకు వెళ్లడం జరిగింది. గత ప్రభుత్వం అమలుచేసిన విద్యా విధానంతో జిల్లాలో నాలుగు వేల మంది విద్యార్థులకు పైగా చదువుకు దూరమయ్యారు. ఊరికి పాఠశాల దూరంకావడమే దీనికి కారణం. అలా చదువుకు దూరమైన పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని అందుబాటులోకి పాఠశాలలను తీసుకొచ్చే విధానాన్ని కూటమి ప్రభుత్వం తీసుకురాలేదు. గత ప్రభుత్వం అనుసరించిన విద్యా వ్యవస్థ లోపాలను సరిచేయకుండా ప్రత్యామ్నాయంగా తొమ్మిది రకాల బడులను ముందుకు తెచ్చింది. ప్రభుత్వ నూతన విద్యా విధానం పేద విద్యార్థులకు మేలు జరిగేలా కనిపించడంలేదు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపర్చేలా గత ప్రభుత్వం తీసుకొచ్చిన విధానం వలే కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిన తొమ్మిది రకాల బడుల వ్యవస్థా వుంది.

ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ అయిన ప్రాథమికోన్నత పాఠశాలలు

ప్రస్తుత నిర్ణయంతో దిబ్బపాలెం, సిరసపల్లి, రాంపురం, రమణయ్యపేట, పెద్దపల్లి, పాల్మాన్‌పేట, ముత్రాసి కాలనీ, మల్లం, కొడవటిపూడి, కుంచంగి, ఖండిపల్లి, జంగాలపల్లి, గుర్రాజుపేట, గోకులపాడు, జి.వెంకటాపురం, దిబ్బపాలెం (అచ్యుతాపురం), దండిసురవరం, బవులవాడ, బంగారమ్మపాలెం పాఠశాలలు అప్‌గ్రేడ్ అయ్యాయి.

దిగంబర దొంగ అరెస్టు

అర్ధనగ్నంగా వెళ్తుంటాడని, దొంగతనం సమయంలో ఎవరికైనా పట్టుపడితే మతిస్థిమితం లేని వ్యక్తిగా నటించి అక్కడ నుండి తప్పించుకుని వెళ తుంటాడని పోలీసులు తెలిపారు. కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ ఎం.అప్పలరాజును, కానిస్టేబుళ్లు ఎస్.హరిప్రసాద్, ఎన్.జగత్ కిరణ్, ఎస్.సాయిలను ఉన్నతాధికారులు అభినందించారు.

యోగా వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

చెప్పారు. ప్రతి చోటా 3 నుంచి 4 వేల మంది యోగాసనాలు వేసేలా అనువైన మైదానాలను గుర్తించాలని, ఈ నెల 17 సాయంత్రంలోగా సంబంధిత నివేదికలు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ప్రతి ఒక్కరినీ వేదిక వద్దకు పంపించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రధాన వేదికలు

ఆర్కే బీచ్ లేదా ఎయు ఇంజినీరింగ్ కళాశాల

జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు స్థానిక ఆర్కే బీచ్ రోడ్ లేదా ఎయు ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో జరిగే ప్రధాన వేడుకలో భాగస్వామ్యం అవుతారని, దానికి సంబంధించిన ఏర్పాట్లు పక్కాగా చేయాలని నిర్దేశించారు. ఆర్కే బీచ్ వద్ద ఒకవేళ వర్షం పడినట్లయితే సమీపంలోని ఎయు కన్వెన్షన్ హాలు ప్రత్యామ్నాయ వేదికగా, ఇంజినీరింగ్ కళాశాల వద్ద వర్షం పడినట్లయితే మద్దిలపాలెం కాకతీయ ఫంక్షన్ హాలు లేదా స్వర్ణభారతి ఇండోర్ స్టేడియాన్ని ప్రత్యామ్నాయ వేదికగా గుర్తించి తగిన ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లాలోని గుర్తించిన ప్రాంతాల్లో పార్కింగ్, తాగునీటి వసతి, విద్యుత్ సదుపాయం ఉండేలా చూసుకోవాలని, అందరూ వీక్షించేందుకు అనుగుణంగా టీవీ స్క్రీన్లు ఏర్పాటు చేయాలని చెప్పారు. శిక్షకుడు అందరికీ కనిపించేలా మైదానంలో ఒక చిన్న స్టేజ్ వేయాలని, పబ్లిక్ అడ్రస్ సిస్టం పెట్టుకోవాలని సూచించారు. రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని, కార్యక్రమానికి సంబంధించి దశల వారీగా ప్రణాళికాయుతంగా విస్తృత ప్రచారం కల్పించాలని కోరారు. ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు, క్రీడాకారులకు, ప్రధాన వేదికల వద్ద భాగస్వామ్యం అయ్యే వారికి ముందస్తు శిక్షణ అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, డిసిపి మేరీ ప్రశాంతి, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్.భవానీ శంకర్, ఎడిసిపి రాజ్ కమల్, ప్రత్యేకాధికారులు సత్తిబాబు, సుధాసాగర్, శేషశైలజ, మధుసూదన్ రావు, డిఇఒ, ఆర్ఐఒ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు, తహశీల్దార్లు, జోనల్ కమిషనర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ఎయు విసి రాజశేఖర్ నుంచి డాక్టరేట్ అందుకుంటున్న షణ్ముఖ

జర్నలిజంలో రేగాన షణ్ముఖకు డాక్టరేట్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం జర్నలిజం విభాగ పరిశోధక విద్యార్థి రేగాన షణ్ముఖకు డాక్టరేట్ లభించింది. ప్రస్తుతం ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం ఇన్‌చార్జి ఉపకులపతి ఆచార్య డి.వి.ఆర్.మూర్తి పర్యవేక్షణలో 'డిఫ్యూజన్ ఆఫ్ ఇన్నోవేషన్ అమాంగ్ షెడ్యూల్ క్యాస్ట్ పాపులేషన్: ఏ స్టడీ ఆఫ్ మోసూరు విలేజ్ ఇన్ ఆంధ్ర ప్రదేశ్ అనే అంశంపై జరిగిన పరిశోధనకు డాక్టరేట్ లభించింది. ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను షణ్ముఖ గురువారం అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను విభాగాచార్యులు, పరిశోధకులు అభినందించారు. ప్రస్తుతం షణ్ముఖ అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమాచార పౌర సంబంధాల శాఖలో పబ్లిక్ రిలేషన్స్ అధికారిగా సేవలందిస్తున్నారు.

చిరస్మరణీయుడు అప్పలరాజు

(మొదటి పేజీ తరువాయి..) ఇస్తున్నాయని అన్నారు. విశాఖలో రూ.కోట్ల విలువైన భూములను ఊరూ పేరూ లేని ఉర్నాకు ఎకరాను 90 పైసలుకు ఇచ్చారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత రావడంతో ప్రభుత్వం సర్దుకుని ఎకరా కోటిన్నరకు ఇస్తున్నట్లు చెప్పిందని తెలిపారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ అప్పలరాజు ప్రజల కోసమే చివర వరకూ బతికారని, 1990వ దశకం నుంచి ఆయన పోరాటాలు చాలా మందికి స్ఫూర్తిగా నిలిచాయని అన్నారు. పెందుర్తిలో ఎర్రజెండా ఎగరడానికి అప్పట్లో టిడిపి, కాంగ్రెస్ బడా నేతలు ఎన్ని ఆటంకాలు సృష్టించినా బెదరకుండా ఎర్రజెండా పట్టి నిలబడిన నాయకుడని కొనియాడారు. సిపిఎం, సిఐటియుల అభివృద్ధికి కృషి చేశారన్నారు. కార్మికనగర్ సహా నల్లక్వారీ, గాంధీ నగర్, ఆంజనేయనగర్‌లలో పేదల కోసం పాకలు వేసి పోరాటాలు నడిపారన్నారు. సభకు అధ్యక్షత వహించిన బి.జగన్ మాట్లాడుతూ కార్మిక నగర్ ఏర్పాటుకు ఆద్యుడు అప్పలరాజు అన్నారు. 1985 నుంచి మోటార్ ట్రాన్స్‌పోర్టు యూనియన్ (సిఐటియు)లో కీలకంగా పనిచేశారన్నారు. కార్యక్రమంలో సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, పి.మణి, బి.పద్మ, వి.కృష్ణారావు, నాయకులు ప్రభావతి, బి.రమణి, బి.వెంకటరావు, బొట్టా ఈశ్వరమ్మ, పి.వెంకటరెడ్డి, అనంతలక్ష్మి, అప్పలరాజు కుటుంబ సభ్యులు విజయ, మహేష్, నాగమణి, కార్మిక నగర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు రామారావు, గోపి తదితరులు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



అప్పలరాజు సంస్మరణ సభకు హాజరైన జనం

కాపులకు అండగా కూటమి ప్రభుత్వం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కాపులకు ఎల్లవేళలా అండగా ఉంటుందని విఎంఆర్‌డిఎ చైర్మన్ ఎం.వి.ప్రణవ్‌గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో కాపు సామాజికవర్గం కోసం కాపు భవనం నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరు కోసం ముఖ్య మంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. గతంలో టిడిపి హయంలో కాపు భవనం కోసం ఎకరా భూమి కేటాయిస్తే, వైఎస్ఆర్‌సిపి హయాంలో అది 50 సెంట్లకు కుదించారని పేర్కొన్నారు. భవన నిర్మాణానికి ఎలాంటి నిధులు విడుదల చేయకుండా ఎన్నికల సమయంలో వైఎస్ఆర్‌సిపి నేతలు హడావుడిగా భూమిపూజ చేసి వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం హయంలోనే కాపు భవనం నిర్మాణం తథ్యమని పేర్కొన్నారు.

టిడ్కో ఇళ్లను వెంటనే పూర్తి చేయాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: రాష్ట్రప్రభుత్వం యుద్ధప్రాతిపదికన టిడ్కో ఇళ్లు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని తెలుగుశక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ డిమాండ్ చేశారు. లబ్ధిదారుల బ్యాంకు రుణాలకు చెందిన ఇఎంఐ కూడా ప్రభుత్వం చెల్లిస్తుందని అసెంబ్లీ సాక్షిగా బిజెపి ఫ్లోర్ లీడర్ పి.విష్ణుకుమార్ రాజు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం ప్రకటించిందన్నారు. గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద రామ్ నిరసన తెలియజేసి అనంతరం మీడియాతో మాట్లాడారు. నిధులన్నీ అమరావతికి మళ్లిస్తున్నారని, ముందుగా టిడ్కో ఇళ్ళు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారులందరికీ టిడ్కో ఇళ్ళు ఇచ్చేవరకు తాను పోరాటం కొనసాగిస్తానన్నారు. ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ భూదందాలపై ఏప్రిల్ 24న ఢిల్లీలో సిబిఐ, కేంద్ర హోంమంత్రికి నివేదిక ఇచ్చానని. దీనిపై ఆగ్రహించి పల్లా శ్రీనివాస్ తనను హతమార్చడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు.

సిహెచ్‌ఒల సమస్యలపై స్పందించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: న్యాయమైన డిమాండ్ల సాధన కోసం 18 రోజులుగా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ సమ్మె చేస్తూ, అన్ని జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తుంటే ప్రభుత్వం కనీసం స్పందించకపోవడం బాధాకరంగా ఉందని, ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించాలని కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు ప్రజ్ఞ కోరారు. వైద్య ఆరోగ్య శాఖలో ఎన్‌హెచ్‌ఎం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఆయుష్మాన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ ఆయుష్మాన్‌భారత్ నిబంధనల ప్రకారం 6 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సిహెచ్‌ఒలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతనం పెంచి చెల్లించాలన్నారు.

22 నుంచి మాస్టర్ ప్లాన్‌పై సలహాల స్వీకరణ

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ: 2021 నవంబర్ 8న ఆమోదించబడిన విఎంఆర్‌డిఎ మాస్టర్ ప్లాన్ 2041ను పున:పరిశీలించేందుకు ప్రభుత్వం ఆదేశించిన క్రమంలో విఎంఆర్‌డిఎ పరిధిలోని ప్రజలు, భాగస్వాములు, సంబంధిత శాఖల నుంచి అభ్యంతరాలు, సలహాలను స్వీకరించడం కోసం ఈ నెల 19వ తేదీన ప్రకటన జారీ చేస్తామని మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్. విశ్వనాథన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మాస్టర్‌ప్లాన్ 2041ను పరిశీలించి అభ్యంతరాలు, సలహాలను ఈ నెల 22 నుంచి జూన్ 21లోపు సమర్పించాలని ఆయన సూచించారు.


ఫ్లైయాస్, కాంక్రీట్ ధూళితో పూడుకుపోతూ ఆక్రమణకు గురవుతున్న చెరువు

కాలుష్య కోరల్లో వెల్లంకి

ఫ్లైయాస్, కాంక్రీట్ ధూళితో ఇబ్బందులు
కిడ్నీ వ్యాధులకు గురవుతున్న గ్రామస్తులు
పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ఆనందపురం : ఆనందపురం మండలం వెల్లంకి పంచాయతీ పరిధిలో అనేక కంపెనీలకు అనుమతులు ఇవ్వడం వల్ల గ్రామం మొత్తం కాలుష్య కోరల్లో చిక్కుకుంది. కంపెనీల నుండి వెలువడే ధూళి దుమ్ము, పొగ వల్ల కేన్సర్, కిడ్నీ తదితర వ్యాధులతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. వెల్లంకి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలతో పాటు, ఎస్సీ కాలనీ, పిన్నింటి వారి కల్లాలు పడాల వారి కల్లాలు, 4వ వార్డు, 7వ వార్డులో సుమారు 600 మంది జనాభా నివసిస్తున్నారు. ఈ సమీపంలో ఆర్ఎంసి నాగార్జున ఫ్లై యాష్ కాంక్రీట్ కంపెనీ నుండి వెలువడే ధూళి దుమ్ము వల్ల పరిసరాల్లో ఉన్న పొలాలు మొత్తం వ్యవసాయం చేయడానికి పనికిరాకుండా పోయాయి. ఈ కంపెనీ సమీపంలో బోలు వారి చెరువు, పల్లంటి వారి చెరువులను వ్యర్థాలతో కప్పివేసి రోడ్లు వేశారు. నాగార్జున కంపెనీ వెనుక సర్వే నెంబర్ 229లో ఐదెకరాలు ఉన్న చెరువు ప్రస్తుతం ఎకరా మాత్రమే ఉంది. మిగతా స్థలమంతా వ్యర్థాలతో నిండిపోయింది.

సర్వే నంబర్ 232లో మూడెకరాలు ఉన్న చెరువు ప్రస్తుతం 30 సెంట్లు కూడా లేని పరిస్థితి ఉంది. కంపెనీ యాజమాని ఫ్లైయాస్ ధూళితో చెరువులను కప్పివేసినా అధికారులు చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఈ కంపెనీ నుండి వెలువడిన ధూళి దుమ్ముతో వ్యవసాయం పాడైపోతుందని, వ్యాధుల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 5 కంపెనీలకు లీజుకిచ్చిన ప్రముఖ వ్యాపారవేత్త రాధాకృష్ణ ప్రతి నెలా అద్దెను వసూలు చేయడమే తప్ప కాలుష్య సమస్యలను పట్టించుకోవడంలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాంక్రీట్ వాహనాల వల్ల రోడ్లు కుంగిపోతున్నాయి. కంపెనీ ముందు ఉన్న చెరువును వెనుక ఉన్న చెరువును ఆక్రమించి వ్యవసాయం చేసుకోవడానికి వీలు లేకుండా చేశారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇలాంటి కంపెనీలపై చర్యలు తీసుకొని నివారణ చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేరాలు ఘోరాలు

ఇద్దరు బాలికలు అదృశ్యం




ప్రజాశక్తి - పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 13వ తేదీ సాయంత్రం 4 గంటల సమయంలో ఇద్దరు బాలికలు ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, వారి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టినట్లు సిఐ కెవి సతీష్‌కుమార్ తెలిపారు. బాలికల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు. పురుషోత్తపురం ప్రాంతానికి చెందిన గంపరాయి చక్రపాణి కుమార్తె హేమిమ (14), అయ్యప్ప కాలనీకి చెందిన పెట్ల కనకరాజు కుమార్తె రాణి (14) ఇద్దరూ కలిసి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని చెప్పారు. వారికోసం బంధువులు, స్నేహితుల ఇళ్లల్లో ఆరా తీసినా ఆచూకీ లేకపోవడంతో బాలికల తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారని వెల్లడించారు. ఈ బాలికలను ఎవరైనా చూసినా, వారి గురించి సమాచారం తెలిసినా వెంటనే 9440796039, 9676797314 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని సిఐ సతీష్‌కుమార్ కోరారు. సమాచారం ఇచ్చినవారిని గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

వ్యక్తిని బెదిరించి సెల్ ఫోన్, నగదు దోచుకున్న ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి -గోపాలపట్నం : వ్యక్తిని బెదిరించి సెల్‌ఫోన్, నగదు దోచుకున్న ఇద్దరు యువకులను, ఒక మైనర్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. క్రైమ్ ఎసిపి డి.లక్ష్మణరావు వివరాలను వెల్లడించారు. మర్రిపాలెం రైల్వే క్వార్టర్స్‌కు చెందిన ఎమ్.అశోక్ కుమార్ ఈ నెల 1వ తేదీన పాత గోపాలపట్నం ప్రాంతంలో రాత్రి 8:30 గంటల సమయంలో బైక్ వెళ్తుండగా ముగ్గురు యువకులు అడ్డగించి గాయపరిచి, అతని నుంచి రూ.4 వేలను ఫోన్ పే చేయించుకొని, సెల్ ఫోన్ లాక్కొని పరారయ్యారు. బాధితుడు అశోక్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెస్ట్ సబ్ డివిజన్ సిఐ నిమ్మకాయల శ్రీనివాసరావు నేతృత్వంలో గోపాలపట్నం క్రైమ్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ జి.తేజేశ్వరరావు దర్యాప్తు చేపట్టారు. ముగ్గురు యువకులను సోమవారం అదుపులోనికి తీసుకొని విచారించగా నేరం చేసినట్టుగా అంగీకరించారు. వీరి ఎల్లపువానిపాలెనికి చెందిన రావాడ ప్రసాద్‌బాబు (32), చంద్రనగర్‌కు చెందిన దవనూరి సాయికుమార్ (25), చంద్రనగర్ తుంపాల వీధికి చెందిన ఒక బాలునిగా (17)గా గుర్తించారు. వీరి నుంచి వివో సెల్ ఫోను, 4వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిలో ఇద్దరిని సెంట్రల్ జైలుకు, ఒకరిని జువనైల్ హోమ్‌కు తరలించామని పోలీసులు తెలిపారు. కేసు ఛేదనలో ప్రతిభ కనబరిచిన గోపాలపట్నం క్రైమ్ సిబ్బందిని ఎసిపి లక్ష్మణరావు అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : టూ టౌన్ పరిధిలోని 35వ వార్డు కొబ్బరి తోట ప్రాంతంలో నివసిస్తున్న గృహిణి సాయి (29) గురువారం సాయంత్రం ఇంటిలోని ఫ్యానుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసుల కథనం ప్రకారం.. ఆమెకూ, భర్త సతీష్‌కూ కొంతకాలంగా మనస్పర్థలున్నాయి. ఈ కారణంగానే ఆమె ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. సతీష్ కలెక్షన్ ఏజెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. తొమ్మిదేళ్ల క్రితం జిల్లా సతీష్‌తో ఆమెకు వివాహం జరిగింది. వారికి ఎనిమిది సంవత్సరాల బాబు ఉన్నాడు. కేసును టూ టౌన్ సిఐ ఎర్రమనాయుడు దర్యాప్తు చేస్తున్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన గంటా రవితేజ

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని ఆనందపురం హైస్కూల్‌ను తెలుగుదేశం పార్టీ యువ నాయకులు గంటా రవితేజ సందర్శించారు. పాఠశాలలు మౌలిక వసతులు, సమస్యలపై ఆరా తీశారు. గత వర్షాల సమయంలో పాఠశాల ప్రహరీ కూలిపోయిందని, నేటికి మరమ్మత్తులు చేపట్టలేదని, దీనివల్ల పలు సమస్యలు ఎదురవుతున్నాయని ప్రధానోపాధ్యాయులు కెఆర్‌కె.పట్నాయక్ వివరించారు. మధ్యాహ్న భోజనం తినడానికి పిల్లలకు డైనింగ్ హాల్ ఏర్పాటు చేయాలని, పాఠశాలలో ల్యాబ్ సౌకర్యం, డిజిటల్ క్లాస్ నిర్వాహకు కంప్యూటర్లు అవసరం ఉందని తెలిపారు. పిఎంశ్రీ పథకం కింద పాఠశాల క్రీడామైదానం కొంతవరకు అభివృద్ధి పనులు చేపట్టామని, పూర్తిస్థాయిలో అభివృద్ధికి మరిన్ని నిధులు అవసరమని వివరించారు. నాడు- నేడులో చేపట్టిన పాఠశాల అదనపు గదుల నిర్మాణాలు సగంలో నిలిచిపోయాయని, వాటిని పూర్తిచేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తర్లువాడ సర్పంచ్ బిఆర్‌బి.నాయుడు, బమ్మిడి సూర్యనారాయణ, తాట్రాజ్ అప్పారావు, లోడగల వెంకటరావు, కె.సత్యమూర్తి, కంచుబోయిన శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణంలో 20 చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని 16 పంచాయతీలకు గాను 15 పంచాయతీల్లో 20 చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అమనాం, చిప్పాడ, దాకమర్రి, లక్ష్మీపురం, మజ్జిపేట, మజ్జివలస, రేఖవానిపాలెం, టి.నగరపాలెం, తాళ్లవలస, తాటితూరు పంచాయతీల్లో ఒక్కో చలివేంద్రం, అన్నవరం, బోడమెట్టపాలెం, మూలకుద్దు, సింగనబంద, నారాయణరాజు పేటలో రెండేసి చొప్పున చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు ఇఒపిఆర్‌డి కె.రమేష్‌నాయుడు గురువారం తెలిపారు.

జనసేన కార్యాలయాన్ని సందర్శించిన నాగబాబు

ప్రజాశక్తి -మధురవాడ : ఎండాడలోని భీమిలి జనసేన పార్టీ కార్యాలయాన్ని గురువారం ఎమ్మెల్సీ కొణిదెల నాగబాబు సందర్శించారు. నాగబాబును పార్టీ భీమిలి ఇన్‌ఛార్జి డాక్టర్ సందీప్ పంచకర్ల సాదరంగా ఆహ్వానించారు. అనంతరం నాగబాబు మాట్లాడుతూ, పార్టీ అభివృద్ధికి అందరూ కలిసి పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కోన తాతారావు, శేఖర్ శ్రీనుబాబు పాల్గొన్నారు.

సెమ్స్‌తో గీతం అవగాహనా ఒప్పందం

ప్రజాశక్తి-మధురవాడ : నౌకా నిర్మాణ రంగంలో నూతన సాంకేతిక పరిజ్ఞానం, పరిశోధన అవకాశాల కోసం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం భారత ప్రభుత్వ ఓడ రేవులు, నౌకాయాన మంత్రిత్వశాఖకు చెందిన విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఇన్ మారిటైమ్ అండ్ షిప్‌బిల్డింగ్ (సెమ్స్) తో గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. గీతం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, సెమ్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్, కమాండర్ ఎస్.గోపీకృష్ణ అవగాహన ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో గీతం ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ డైరక్టర్ ప్రొఫెసర్ జివిఆర్.శర్మ, గీతం ఇఇసిఇ విభాగం ప్రొఫెసర్ జివిఎస్.రాజశేఖర్, బి.సూరజ్ అరవింద్, సెమ్స్ జనరల్ మేనేజర్ ఎస్.మజుందార్, సెమ్స్ మేనేజర్ లివింగ్‌స్టన్ ప్రాన్సిస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్ఓయులో భాగంగా గీతం విద్యార్థులకు సెమ్స్ ఆధ్వర్యాన స్వల్ప కాలిక శిక్షణ కార్యక్రమాలు, వర్క్‌షాప్‌లు, ఇంటర్న్‌షిప్‌లు, నౌకా నిర్మాణ రంగ పరిశ్రమలను సందర్శించే అవకాశం కల్పిస్తారు. అలాగే గీతం అధ్యాపకులకు మెకానికల్, ఎలక్ట్రానిక్స్, ఇఇఇ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్ విభాగాలలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తారు. పరిశోధక విద్యార్థులకు, నౌకానిర్మాణ రంగంలో అధ్యయనాలకు సహకరించడంతో పాటు సెమ్స్ ప్రయోగశాలల వినియోగానికి అనుమతిస్తారు. వీటితో పాటు ఆన్‌లైన్ శిక్షణ కార్యక్రమాలు, నిపుణులతో ప్రసంగాలు ఏర్పాటు, విద్యార్థులకు నౌకానిర్మాణ, నౌకాయాన రంగంలో ఉద్యోగాలను పొందడానికి వీలుగా మార్గదర్శకం చేస్తారు.


ఒప్పందపత్రాలను మార్చుకుంటున్న ప్రతినిధులు

ఈ సందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ మాట్లాడుతూ, గీతం విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలనేది తమ లక్ష్యం అని పేర్కొన్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలోనే కాక నౌకా నిర్మాణ, నౌకాయాన రంగాలలో మంచి అవకాశాలను విద్యార్థులు సెమ్స్ సహకారంతో పొందగలరన్నారు. సెమ్స్ సిఇఒ ఎస్.గోపీకృష్ణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నౌకా నిర్మాణ రంగంపై ప్రత్యేక దృష్టి సారించాయని, ముఖ్యంగా నైపుణ్యంగల వారికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని పేర్కొన్నారు. గతంలో తమ వద్ద శిక్షణ పొందిన వారికి దేశంలోని ప్రధాన పోర్టులలో ఉన్నత స్థానాలు లభించాయని వెల్లడించారు. వారిలో గీతం విద్యార్థులు ఉన్నారని తెలిపారు.

ఇళ్ల మధ్యనే మురుగు నీరు


ఆదర్శనగర్‌లో ఇళ్ల మధ్యనే నిల్వ చేరిన మురుగు నీరు

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి ఆదర్శనగర్‌లో ఇళ్ల మధ్యనే మురుగు నీరు నిల్వ ఉండడంతో సమీపంలోని కుటుంబాలు పారిశుధ్య సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. వివిధ ఇళ్లల్లోని వాడుక నీరు ఒకే చోటకు చేరుతుంది. మురుగు నీరు వెళ్లే మార్గం లేక నెలల తరబడి నిల్వ ఉండడంతో దుర్వాసన వెలువడుతుందని స్థానికులు గురువారం ప్రజాశక్తికి తెలిపారు. దీనివల్ల రాత్రి వేళల్లో దోమలు విపరీతంగా ఇళ్లలోకి వస్తున్నాయని, కంటి మీద కునుకు కరువవుతోందని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. దోమ కాటు వల్ల పిల్లలకు ఒక్కో సారి జ్వరాలు వస్తున్నాయని వాపోయారు. ఈ ప్రాంతంలో అనేక చోట్ల కాల్వలు లేక వాడుక, వర్షపు నీరు వెళ్లే మార్గం లేక నిల్వ ఉండడంతో పారిశుధ్య సమస్యలు తలెత్తుతోంది. ఈ ప్రాంతంలో ఎక్కువ మంది ఎగువ, మధ్య తరగతి ప్రజలు ఉంటున్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా జివిఎంసి ఆధ్వర్యాన అవసరమైన చోట కాల్వలు, డ్రెయిన్లను నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

సమయపాలన పాటించాలి : డిఎం అండ్ హెచ్ఒ

ప్రజాశక్తి-సీతమ్మధార : వైద్యాధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆదేశించారు. చినముషిడివాడ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. అభ ఐడి రిజిస్ట్రేషన్ తక్కువగా ఉండటం, వైద్యాధికారి అందుబాటులో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అభ ఐడి రిజిస్ట్రేషన్, ముఖహాజరు వేస్తూ, సమయపాలన పాటించాలని, లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పురుషోత్తపురం పట్టణ ఆరోగ్యకేంద్రాన్ని సందర్శించారు. వైద్యాధికారి అందుబాటులో ఉండటంతో సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఎన్‌సిడి 3.0, అభ ఐడి జనరేషన్‌పై పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ముఖ్యంగా ఓపి, ఐపి, ల్యాబ్ టెస్ట్, సాధారణ ప్రసవాలు, ఆర్‌సిహెచ్ రిజిస్ట్రేషన్, కెపిఐ ఇండికేటర్స్ గురించి పలు సూచనలు చేశారు. ఆశా కార్యకర్తలు తమ ప్రాంతాల్లో ఎఎన్ఎంలతో కలిసి గర్భిణులకు టిటి వాక్సిన్, ఐరన్, ఫోలిక్ మాత్రలు అందేటట్లు చూడాలన్నారు.

విరిగిన విద్యుత్ స్తంభాలు మార్పు

- ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -ఆనందపురం: ఆనందపురం మండలం పెద్దిపాలెం పంచాయతీ పరిధిలో జాతీయ రహదారికి ఆనుకొని ఓరియంట్ హోటల్ పక్కన స్తంభాలు నేలకొరిగి విద్యుత్ వైర్లు వేలాడుతున్న సమస్యను ఆ శాఖ అధికారులు సరిచేశారు. 'ప్రమాదాలకు నిలయంగా విద్యుత్ వైర్లు' శీర్షికన ప్రజాశక్తిలో బుధవారం ప్రచురితమైన కథనానికి విద్యుత్ శాఖ ఎఇ అప్పలనాయుడు స్పందించారు. ఎఇ ఆదేశాల మేరకు సిబ్బంది కొత్త స్తంభాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించారు. బిపి కల్లాల రోడ్డు శుభశ్రీ ఫంక్షన్ హాల్ వద్ద విరిగిన స్తంభాన్ని కూడా మార్పు చేసి కొత్త స్తంభం ఏర్పాటు చేశారు. మండల పరిధిలో విద్యుత్ సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని ఎఇ కోరారు.

సీజనల్ వ్యాధుల నివారణపై అవగాహన

ప్రజాశక్తి- ములగాడ : మల్కాపురం ఏరియా మలేరియా విభాగంలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు డెంగీ మలేరియా, చికున్ గునియా తదితర సీజనల్ వ్యాధుల నివారణపై గురువారం జోన్ ప్రజా ఆరోగ్య శాఖ సహాయ వైద్యాధికారి సునీల్ శ్రీహరిపురంలోని మలేరియా కార్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని, తమ వార్డుల్లో ప్రజలతో మమేకమై సీజనల్ వ్యాధుల వల్ల కలిగే అనర్థాలను వారికి అర్థమయ్యే రీతిలో వివరించి, ఆ వ్యాధుల ఉధృతికి అడ్డుకట్ట వేయాలన్నారు. యాంటీ లార్వల్ ఆపరేషన్‌ను పక్కాగా నిర్వహించాలన్నారు. ఒక ఇంటికి వెళ్లేప్పుడు ఆ ఇంట్లో ఉన్న వాటర్ కంటైనర్లతో పాటు పరిసరాలలో కూడా నీటి నిల్వలను గుర్తించి తొలగించాలన్నారు. లార్వా దశలోనే డెంగీ, మలేరియా, చికున్ గునియా వ్యాధుల కారక దోమలను నిర్మూలించాలని ఆదేశించారు. ప్రతి శుక్రవారమూ డ్రై - ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. ఫాగింగ్, స్ప్రేయింగ్ కార్యక్రమాలను పక్కాగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సతీష్, రమేష్, జిల్లా మలేరియా విభాగం టెక్నికల్ సూపర్‌వైజర్ భవాని, సూపర్‌వైజర్ డి.శ్రీనివాసరావు, మలేరియా కార్మికులు పాల్గొన్నారు.



జీవవైవిధ్య దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా జీవవైవిధ్య దినోత్సవం

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో జీవవైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని జోనల్ స్థాయిలో విద్యార్థులకు, వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విశాఖపట్నం జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎన్.ప్రేమ్‌కుమార్ ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ, ప్రతి విభాగంలో ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికవుతారని తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, పర్యావరణ పరిరక్షణపై అవగాహన, సామాజిక బాధ్యత పెంపొందించడంలో ఎంతో సహాయపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ జిల్లా కో-ఆర్డినేటర్ బాబూరావు, విజయనగరం జిల్లా కో-ఆర్డినేటర్ వేణుగోపాల్, అనకాపల్లి జిల్లా కో-ఆర్డినేటర్ భగేష్, ప్రాంతీయ కో-ఆర్డినేటర్ జానకీరామ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వైబిఎస్ వేణుగోపాల్ పాల్గొన్నారు.



విద్యార్థులతో పాఠశాల ప్రతినిధులు

సిబిఎస్ఇ ఫలితాల్లో రవీంద్ర భారతి విజయదుందుభి

ప్రజాశక్తి -ఆనందపురం : సిబిఎస్ఇ ఫలితాల్లో ఆనందపురం రవీంద్ర భారతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారు. బి.మేఘవర్షిని 489/500 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిందని పాఠశాల చైర్మన్ ఎంఎస్.మణి తెలిపారు. కె.ఉజ్వల్ సాయి 480, కె.తేజస్విని 476, వి.షణ్ముఖసాయి 475, పి.శ్రీహర్షిత్ 473, శ్రీదేవి 470, కె సింగరాజ్ 470, 450కి పైగా మార్కులను 12 మంది విద్యార్థులు సాధించారని పేర్కొన్నారు. 98 శాతంతో ఫలితాలలో అగ్రస్థానంలో తమ పాఠశాల నిలిచిందని తెలిపారు. విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారానే ఈ విజయాన్ని సాధించగలిగామన్నారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను అభినందిస్తూ ఏర్పాటుచేసిన సభలో నార్త్‌ఆంధ్ర జోనల్ ఇన్‌ఛార్జి ఎన్.వెంకటేష్, సిజిఎం జిఆర్.వసంత, జిఎం కె.రమ్య, పాఠశాల డీన్ ఉమామహేష్, ఎజిఎం రమణ పాల్గొన్నారు.



ప్రభుత్వ కొలువులే లక్ష్యంగా...

➩ పౌరగ్రంథాలయాన్ని వినియోగించుకుంటున్న విద్యార్థులు

ప్రజాశక్తి-సీతమ్మధార : పోటీ పరీక్షల్లో తమ ప్రతిభను నిరూపించుకుని ఉద్యోగం సాధించేలా విద్యార్థులు పోటీపడి చదువుకుంటున్నారు. వీరికి ద్వారకానగర్‌లోని పౌర గ్రంథాలయంలో ఒక వేదికగా ఉంది. పౌర గ్రంథాలయంలో పోటీ పుస్తకాలు, పేపర్లు అందుబాటులో ఉంచడంతో పాటు వారు చదువుకునేందుకు పలు సదుపాయాలను కల్పించడంతో విద్యార్థులు ఎక్కువ సంఖ్యలో వినియోగించుకుంటున్నారు. డిఎస్‌సి, ఎస్ఎస్‌సి, రైల్వే, బ్యాంకు తదితర రంగాల్లో ఉద్యోగాలు సాధించేందుకు లక్ష్యాన్ని ఏర్పరుచుకొని విద్యార్థులు చదువుకుంటున్నారు.

డిఎస్‌సికి ప్రిపేర్ అవుతున్నా..

మూడు నెలలుగా పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్నాను. డిఎస్‌సి కోసం ప్రిపేర్ అవుతున్నాను. చదువుకునేందుకు పౌర గ్రంథాలయం ఎంతో ఆహ్లాదకరంగా ఉంది.



రాజేశ్వరమ్మ
దొండపర్తి వాసి

ఎస్ఎస్‌సి పరీక్షలకు సిద్ధమవుతున్నా..

ఎస్ఎస్‌సి పరీక్షల కోసం రెండేళ్లుగా ప్రిపేర్ అవుతున్నాను. పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్నాను. గ్రంథాలయంలో చదువుకోవడం ద్వారా తోటి విద్యార్థుల సహాయ సహకారాలు ఉంటున్నాయి. పోటీపడి చదువుకునే అవకాశం ఉంది.



శ్రీలత

ఉద్యోగమే లక్ష్యం

ఎంబిఏ చదివి 8 నెలలుగా పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్నాను. ప్రభుత్వ ఉద్యోగం సాధనే లక్ష్యంగా చదువుతున్నాను. పౌర గ్రంథాలయం నుంచి పూర్తి సహకారం అందుతుంది.



కృష్ణమ్మనాయుడు

కానిస్టేబుల్ కావాలని...

కానిస్టేబుల్ ఉద్యోగం కోసం 18 నెలలుగా పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్నాను. ఈసారి ఉద్యోగం సాధిస్తానని నమ్మకం కలిగింది. సీతమ్మధారలో గది అద్దెకు తీసుకొని ఉంటూ, పౌర గ్రంథాలయంలో చదువుకుంటున్నాను.



సాయి పూడి

అన్ని సదుపాయాలూ కల్పించాం

గ్రంథాలయంలో ఆధునిక టెక్నాలజీతో విద్యార్థులకు అన్ని సదుపాయాలూ కల్పించాం. చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తున్నాం. గ్రంథాలయాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్నాం. విద్యార్థులకు పోటీ పరీక్షల పుస్తకాలను, పేపర్లను అందుబాటులో ఉంచుతున్నాం. ఉద్యోగమే లక్ష్యంగా విద్యార్థులు సాధన చేయడం ఆనందంగా ఉంది.

డిఎస్.వర్మ
గ్రంథాలయ కార్యదర్శి

రమణరావు కుటుంబానికి వివిఎస్ఆర్ పరామర్శ

ప్రజాశక్తి -గాజువాక : రోడ్డు ప్రమాదంలో సిపిఎం సీనియర్ నాయకులు పివైవి.రమణరావు మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు గురువారం పరామర్శించారు. చినగంట్యాడలోని వారి ఇంటికి వెళ్లి రమణరావు భార్య సుభద్రాదేవిని, కుమార్తెలు, అల్లుళ్లను పరామర్శించారు. ప్రమాదం జరిగిన విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ, రమణరావు మృతి పార్టీకి తీరని లోటన్నారు. చివరి వరకు పార్టీ నిర్వహణ బాధ్యతలు చూస్తూ అసువులు బాశించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, లోకేష్, బంగారు నాయుడు, సత్యనారాయణ ఉన్నారు.



రమణరావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వి.శ్రీనివాసరావు, లోకనాథం తదితరులు

పాలిసెట్‌లో సుమన్ ట్యుటోరియల్స్ ప్రభంజనం



ర్యాంకులు సాధించిన విద్యార్థులతో సుమన్

ప్రజాశక్తి-మాధవధార : మురళీనగర్ ఈస్ట్ అయ్యప్పనగర్‌లోని సుమన్ ట్యుటోరియల్స్ ఏపీ పాలిసెట్ -2025 ఫలితాల్లో స్టేట్ ర్యాంకులు సాధించిందని వ్యవస్థాపక చైర్మన్ ఆర్.సుమన్ ప్రకాశం తెలిపారు. ఫలితాలలో ర్యాంకులు సాధించిన విద్యార్థులను గురువారం సంస్థ ప్రాంగణంలో జరిగిన సక్సెస్ మీట్ కార్యక్రమంలో సుమన్ ప్రకాశం అభినందించారు. ఎన్.నవ్యశ్రీ 949, డి.కార్తీక్ 1860, ఎమ్‌డి రియాజ్ 1865, డి.దీక్షితశ్రీ 3162, ఎ.భరత్ 3296, జె.నిస్సీజాయ్ 3313, వి.ఢిల్లేశ్వరి 3425, కె.రాధిక 3645, ఎన్.సందీప్ 7152, జి.భగవాన్ 7179, జి. లీలాధర్ 8123, కె.సాత్విక 8605, కె.హృతిక్‌రాజ్ 11309 రాష్ట్ర స్థాయి ర్యాంకులతోపాటు ఉత్తమ ర్యాంకులు సాధించి విజయకేతనం ఎగురవేశారని ఆయన తెలిపారు. ఫ్యాకల్టీ మ్యాథ్స్‌కు బాబూరావు, దేవరాజ్, కృష్ణ, ఫిజిక్స్‌కు శాస్త్రి, సుబ్రహ్మణ్యం, అవినాష్, సుమన్ శిక్షణతో ఈ కోచింగ్ సెంటర్ నుండి 62 మంది విద్యార్థులు పాలిసెట్ పరీక్షకు హాజరుకాగా శతశాతం అర్హత సాధించారని వివరించారు. ఈకార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ బాబూరావు, ప్రిన్సిపల్ దేవరాజు, అధ్యాపక బృందం, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదవడంపై ఆసక్తి పెంచుకోవాలి

ప్రజాశక్తి-ములగాడ : పుస్తకాలను చదవడంపై బాలలు ఆసక్తి పెంచుకోవాలని 61వ వార్డు టిడిపి అధ్యక్షులు మజ్జి సోమేష్ సూచించారు. మల్కాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న బాలల వేసవి శిక్షణ శిబిరంలో గురువారం ఆయన మాట్లాడుతూ, బాలలు సెల్ ఫోన్లకు దూరంగా ఉంటూ గ్రంథాలయాలకు వెళ్లి పుస్తకాలను చదవాలని సూచించారు. గ్రంథాలయాధికారి వి.అజయ్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక పెద్దలు శంకరరావు, జి.ఉమామహేశ్వరరావు, సన్యాసిరావు, కృపారాణి తదితరులు పాల్గొన్నారు.

డిఎస్‌సికి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ (ఎంఎస్) ఆధ్వర్యాన డిఎస్‌సికి ఉచిత శిక్షణ ప్రారంభమైంది. మొదటి రోజు సుమారు 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, ప్రధాన కార్యదర్శి జెవి.ప్రభాకర్, విజ్ఞాన కేంద్రం వైస్ చైర్మన్ డి.అచ్చంనాయుడు, డైరెక్టర్ ఆర్.శంకర్, వైస్ ప్రెసిడెంట్ ఎం.చంటి, బి.గౌతమ్‌బాబు, జాయింట్ సెక్రెటరీ ఫ్యాకల్టీ పి.రవికుమార్ హాజరై మాట్లాడారు. ఈ శిక్షణ వారం రోజులు పాటు కొనసాగుతుందని తెలిపారు.

హెడ్ కానిస్టేబుల్ పప్పలకు సన్మానం

ప్రజాశక్తి -మాధవధార : మాధవధార పరిరక్షణకు మాధవధార గ్రామస్తులు పప్పల వరహానరసింహం హెడ్ కానిస్టేబుల్ చేసిన సేవలు మరువలేవని మాధవస్వామి దేవాలయం అర్చకులు సనపల వరహానరసింహం, సనపల రవీంద్ర కుమార్ అన్నారు. ఇటీవల ఉద్యోగ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం న్యూ పోర్టు ట్రాఫిక్ విభాగానికి పప్పల వరహా నరసింహం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయనను మాధవ స్వామి దేవాలయం అర్చకులు, గ్రామ ప్రజలు, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మాధవధార ప్రాంతంలో రాత్రి వేళల్లో అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరిగేవని, పప్పల వరహానరసింహం రాత్రి వేళల్లో నిఘా పెట్టి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారని తెలిపారు. ముఖ్యంగా నగరంలోని పలు ప్రాంతాల నుంచి అనేకమంది మాధవధార తోటల్లోకి వచ్చి నిత్యం గంజాయితో పాటు మద్యం తాగి ఇక్కడకు వచ్చే భక్తులకు అసౌకర్యానికి గురి చేసేవారని, వీరిపై కంచరపాలెం సిఐతో మాట్లాడి ప్రత్యేక నిఘా ఏర్పాటుచేయించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కంచరపాలెం సబ్ ఇన్‌స్పెక్టర్ దివ్య భారతి, శ్రీ మాధవ యువజన సమాజం మాజీ అధ్యక్షులు భగవతి శ్రీరామమూర్తి, మాధవధార కళింగ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సంబాల ఈశ్వరరావు, పేడాడ రాము, సనపల వెంకటరావు, మూల లక్ష్మణరావు, మణికంఠ, శ్రావణ్ కుమార్, లక్ష్మీకాంత్, సనపల హరిబాబు తదితరులు పాల్గొన్నారు.



పప్పల వరహానరసింహాన్ని సన్మానిస్తున్న మాధవధార ప్రజలు

టిడిపిలో కుమ్ములాటలు



- రెండు గ్రూపులుగా చీలిన కేడర్
- మండల అధ్యక్షుడిని మార్చే యోచన?
- పార్టీ మండల కార్యాలయ ప్రారంభోత్సవానికి బండారుకు అందని ఆహ్వానం

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని తెలుగుదేశం పార్టీలో కుమ్ములాటలు రోజు రోజుకు పెరుగుతున్నాయి. టిడిపి పెందుర్తి నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కేంద్రాలు రెండు గ్రూపులు నడుస్తున్నాయి. స్థానిక ఎమ్మెల్యేగా జనసేన పార్టీ నేత పంచకర్ల రమేష్‌బాబు కూటమి ధర్మంలో భాగంగా గండి బాబ్జీ గ్రూపునకు ప్రాధాన్యత ఇస్తుండగా, బండారు సత్యనారాయణమూర్తి గ్రూపును పూర్తి పక్కన పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

గతంలో పరవాడ ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, నియోజకవర్గాల పునర్విభజన తరువాత 2014లో పెందుర్తి ఎమ్మెల్యేగా పని చేసిన బండారు సత్యనారాయణమూర్తికి 2024 సార్వత్రిక ఎన్నికలలో పెందుర్తి టికెట్ దక్కలేదు. టిడిపి, జనసేన, బిజెపి పార్టీల కూటమిగా ఏర్పడి జనసేన పార్టీ తరపున పంచకర్ల రమేష్ బాబుకు ఇక్కడి టికెట్ ఇచ్చారు. దీంతో అలకపూనిన బండారుకు తప్పని పరిస్థితిలో మాడుగుల స్థానాన్ని కేటాయించారు. దీంతో బండారు గ్రూపు తీవ్ర అసంతృప్తికి గురై ఎన్నికల్లో కూటమి అభ్యర్థికి సరిగా సహకరించలేదన్న విమర్శలు నాడు వచ్చాయి. కూటమి విజయోత్సవ సభలో గండి బాబ్జి బహిరంగంగానే బండారు గ్రూపుపై విమర్శలు చేసిన విషయం విధితమే.

మరో వైపు బండారు మాడుగుల ఎమ్మెల్యేగా వెళ్లడంతో పెందుర్తి నియోజకవర్గం టిడిపి బాధ్యతలు గండి బాబ్జికి పార్టీ అధిష్టానం అప్పగించింది. టిడిపిలో బండారు, గండి బాబ్జి కేంద్రాలుగా రెండు గ్రూపులు ఏర్పడ్డాయి. అన్ని గ్రామాలలో బండారు గ్రూపు నాయకులు ఉన్నారు.

టిడిపి ఆవిర్భావం నుండి రామకష్ణంరాజు, ఇందుల కొండలరావు, ఇందల వరహాలమ్మ, గొర్లి శ్రీనివాస్, పైల బుజ్జి, పైల సన్యాసినాయుడు మాస్టారు, బోండా సన్ని దేముడు, పైల గోపాల్, అట్టా సన్యాసప్పారావు, మేడిశెట్టి బాలాజీ నాయుడు, మచ్చ శివ తదితరులు బండారు వెనుకే ఉన్నారు. మాజీ జెడ్‌పిటిసి పైలా జగన్నాధరావు, కన్నూరు వెంకటరమణ నాయకత్వంలో కేడర్ గండి బాబ్జీ వెనుక నడుస్తోంది. ఈ గ్రూపు రాజకీయాలు ఏ స్థాయికి వెళ్లాయంటే... ఇటీవల పరవాడ మండల టిడిపి కార్యాలయం ప్రారంభోత్సవానికి బండారును ఆహ్వానించలేదు. దీంతో ఆయన గ్రూపు గుర్రుగా ఉన్నట్లు సమాచారం. మరో వైపు బండారు గ్రూపునకు జనసేనకు చెందిన ఎమ్మెల్యే పంచకర్ల సహకరించలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

టిడిపి మండల అధ్యక్షుడు చిన్నకు పదవీ గండం?

టిడిపి మండల అధ్యక్షులుగా ఉన్న రావాడ గ్రామానికి చెందిన వియ్యపు చిన్న అటు బండారు, ఇటు బాబ్జీ రెండు గ్రూపులతో సంబంధాలు కొనసాగిస్తున్నారు. అయితే బొగ్గు లారీల వ్యవహారంలో వచ్చిన విభేదాల నేపథ్యంలో వెన్నెలపాలెం వైసిపి నేతలతో వియ్యపు చిన్న చెట్టాపట్టాలు వేసుకొని తిరుగుతున్నారని, ఆయన్ను టిడిపి నుండి తొలగించాలని బండారు గ్రూపునకు చెందిన కొంత మంది నాయకులు మీడియా సమావేశం పెట్టిమరి డిమాండ్ చేశారు. మరో వైపు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గండి బాబ్జీ తన అనుచరుడిని టిడిపి మండల అధ్యక్షునిగా నియమించాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో తానాం గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నేతను టిడిపి మండల అధ్యక్షులుగా నియమించే అవకాశం ఉందని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి



సబ్బవరంలో మాట్లాడుతున్న సిపిఎం నేత సత్యవతి

ప్రజాశక్తి-సబ్బవరం

జులై 9న జరుగు దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని మండల సిపిఎం కార్యదర్శి ఉప్పాడ సత్యవతి పిలుపునిచ్చారు. స్థానిక దుర్గమాంబ ముఠా కార్మికులతో గురువారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మోడీ ప్రభుత్వ లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, వ్యవసాయ నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముఠా కార్మిక సంఘం అధ్యక్షులు బర్ల రమణ, డి నూకరాజు పాల్గొన్నారు.

సమ్మె నోటీసులు అందజేత

కె.కోటపాడు : దేశవ్యాప్తకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ గ్రామ రెవెన్యూ సహాయకులు సంఘం నాయకులు గురువారం ఇన్‌ఛార్జి తహశీల్దారు, డిప్యూటీ తహశీల్దారు రమేష్‌బాబుకు సమ్మె నోటీసు అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.రవి, మండల అధ్యక్షులు నరవ పోలీస్, వీఆర్‌ఏ శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముఠా కార్మికుల సంఘీభావం

చోడవరం : దేశ వ్యాప్త సమ్మెకు చోడవరం ముఠా కళాశాలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కోశాధికారి వివి.శ్రీనివాసరావు, నాయకులు ఎస్వీ నాయుడు మాట్లాడారు. కార్యక్రమంలో ప్రేమ్ చంద్రశేఖర్, వెంకటరావు, శ్రీను, నాయుడు, నాగిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : జులై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎపి ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎఐటియుసి) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.వామనమూర్తి పిలుపునిచ్చారు. గురువారం ఆర్‌టిసి కాంప్లెక్స్ ఇన్ గేటు వద్ద సమ్మె ప్రచారం చేపట్టారు. సమ్మె రోజున ఆటోలన్నీ బంద్ అవుతాయన్నారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.కాసుబాబు, పడాల గోవింద్ పాల్గొన్నారు.

జ్ఞానాపురం జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం కాలనీలో జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్‌టియు, ఎఐకెఎంఎస్‌ల ఆధ్వర్యాన సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఐఎఫ్‌టియు జిల్లా ఉపాధ్యక్షులు ఎం.తిరుపతిరావు, నాయకులు నారాయణ, జయమ్మ, ఎంఎన్‌ఎస్‌ఎస్ నగర కన్వీనర్ ఈసర లక్ష్మి పాల్గొన్నారు.



చోడవరంలో ముఠా కార్మికులతో మాట్లాడుతున్న శ్రీను

గాజువాక : దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కొత్త గాజువాక కూడలిలో ఎఐటియుసి ఆధ్వర్యాన ప్రచారం నిర్వహించారు. సమ్మెలో సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొనాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.ఆనంద్, కె.అచ్యుతరావు, పెదపూడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మధురవాడ : ద్రోణంరాజు కళ్యాణ మండపం, 7వ వార్డు కార్యాలయం వద్ద మున్సిపల్ ప్రజా ఆరోగ్య విభాగంలో పనిచేస్తున్న కార్మికులు గురువారం సమావేశమయ్యారు. మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమ్మెలో అన్ని రంగాల కార్మికులు పెద్దఎత్తున పాల్గొని కార్మికుల శక్తిని చూపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి ఎంవి.ప్రసాద్, సిఐటియు నాయకులు డి.అప్పలరాజు, క్లాప్ డ్రైవర్ల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజు, కె.సన్నీ, మున్సిపల్ యూనియన్ జోన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎస్.రామప్పడు, సిహెచ్.శేషు బాబు, జి.కిరణ్, బి.రాంబాబు, కె.రమణ, వి.గోవిందు, నరసయ్యమ్మ, ఎస్.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి.వెంకటరెడ్డి

ములగాడ : దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ హెచ్‌పిసిఎల్ సి గేట్ వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యాన గురువారం సమావేశం నిర్వహించారు. ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవిల్లి నాగభూషణం మాట్లాడుతూ, కార్మికులకు అన్యాయం చేస్తూ, కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాచేలా ఉన్న పాలకుల విధానాలకు వ్యతిరేకంగా జరిగే సమ్మెలో కార్మికులందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్‌ఆర్‌టియుసి జిల్లా అధ్యక్షులు అనిల్‌కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి పైడిరాజు, లక్ష్మణమూర్తి, ఎఐటియుసి నాయకులు కసిరెడ్డి సత్యనారాయణ, ఐఎన్‌టియుసి నాయకులు ఎస్.తాతబాబు, పెద్దాడ కుంచారావు, రాజేష్, నాయకులు రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



కె.కోటపాడు డిటికి సమ్మె నోటీసు ఇస్తున్న దృశ్యం



హెచ్‌పిసిఎల్ గేట్ వద్ద అఖిలపక్ష కార్మిక సంఘాల నేతలు



ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం ప్రారంభంలో పాల్గొన్న ఎస్‌పి

ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : అనకాపల్లి మహిళా పోలీస్ స్టేషన్‌ను ఆధునికీకరించి ఏర్పాటు చేసిన ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్‌ను జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సౌకర్యాలతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. మహిళల భద్రత, గృహ హింస, కుటుంబ కలహాలు వంటి సమస్యలకు శాంతియుతంగా, సమర్ధవంతమైన పరిష్కారాలు అందించడమే ఈ కేంద్రం లక్ష్యమని చెప్పారు. మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రజలు డౌన్లోడ్ చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 2,25,521 మంది యాప్‌లో నమోదయ్యారని, మొత్తం 177 ఎస్‌ఓఎస్ కాల్స్ వచ్చాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 5 శక్తి బృందాలు ఏర్పాటు చేశామని, (ప్రతి బందంలో 1 ఎస్‌ఐ, ఐదుగురు సిబ్బంది ఉన్నట్లు చెప్పారు. వీరు 78 హాట్‌స్పాట్లు గుర్తించి, 271 సార్లు సందర్శించారని తెలిపారు. అనంతరం 226 మందికి కౌన్సిలింగ్ నిర్వహించారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో యాక్ట్, గుడ్ టచ్ – బ్యాడ్ టచ్, మహిళా చట్టాలపై విద్యార్థులకు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తునామని చెప్పారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఎం.దేవప్రసాద్, ఎల్.మోహనరావు, మహిళా పోలీస్ స్టేషన్ డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, సిఐలు చంద్రశేఖర్, విజయ్ కుమార్, అప్పలనాయుడు, బాల సూర్యరావు, వెంకటనారాయణ, ఎస్సైలు శిరీష, యమునా, అలీ షరీఫ్, శేఖరం, వన్ స్టాప్ సెంటర్ సిబ్బంది, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునిగా తులసీరామ్ ఎన్నిక



పీలా తులసీరామ్

ప్రజాశక్తి-అచ్యుతాపురం : తెలుగుదేశం పార్టీ అచ్యుతపురం మండల అధ్యక్షుడిగా పీలా తులసీరాము ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు, ఏపీ రహదారులు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, ధూళి రంగనాయకులు తదితరుల సమక్షంలో మండల కమిటీ ఎన్నిక జరిగింది. మండలంలోని 34 గ్రామ కమిటీ అధ్యక్ష కార్యదర్శుల ఆమోదంతో తులసీరామును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. కాజీపాలెం గ్రామానికి చెందిన పీలా తులసీరాము సీనియర్ నాయకుడిగా పార్టీకి ఎనలేని సేవలు అందించారు. 1992లో ఎంపీయుపి స్కూల్ గౌరవాధ్యక్షునిగా రాజకీయ ప్రవేశం చేసిప ఆయన 1995లో ఎంపీటీసీగా ఎన్నికయ్యారు. రెండు సార్లు ఎంపిటిసిగా, రెండు సార్లు సర్పంచ్‌గా పని చేశారు. 2000 నుంచి 2010 వరకు టిడిపి మండల ప్రధాన కార్యదర్శిగా, 2015 నుంచి నేటి వరకు ఉమ్మడి విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శిగా పని చేశారు.

ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు రిజిస్ట్రేషన్లు

ప్రజాశక్తి-చోడవరం : 2019 అక్టోబర్ 15 నాటికి 150 గజాల లోపు ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి జీఓ 30 ప్రకారం ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి పట్టే ఇవ్వడం జరుగుతుందని స్థానిక తహశీల్దారు ఎ.రామారావు తెలిపారు. వీటికోసం ఎలక్ట్రికల్ బిల్, ఇంటి పన్ను, దస్తావైజు, ఇతర ఆధారాలు ఏవైనా ఒకటి ఉంటే సరిపోతుందని పేర్కొన్నారు. 150 గజాల నుండి 300 గజాల వరకు 15శాతం రాయితీతో రిజిస్ట్రేషన్ పట్టా ఇస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో మూడు సెట్లు, పట్టణ ప్రాంత రెండు సెంట్లు ఇప్పటివరకు ఇల్లు లేని పేదలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇందుకోసం గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ బంజారా, గ్రామ కంఠం, ఇతర స్థలాలను గుర్తించి పట్టాలు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే ద్వారా ఇల్లులు ఇళ్ల స్థలాలు లేని వారు గుర్తించడం జరుగుతుందని పేర్కొన్నారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకునే వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సత్వరమే పనులను చేస్తున్నామని చెప్పారు.



కమిటీ సభ్యులకు అభినందనలు తెలుపుతున్న నాయకులు

టిడిపి గ్రామ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని దిబ్బిడి గ్రామ టీడీపీ కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పార్టీ గ్రామ శాఖ అధ్యక్షునిగా పెదిరెడ్ల రాజు, ఉపాధ్యక్షునిగా ముమ్మిన నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా ఆకుల వరహామాణిక్యం, కోశాధికారిగా పల్లి శ్రీను, మంత్రి మహేష్ ఎన్నికయ్యారు. గ్రామ తెలుగు యువత అధ్యక్షులుగా తాటికొండ గణేష్, ఉపాధ్యక్షులుగా గంటా సన్యాసినాయుడు, కార్యదర్శిగా చిన్ని లక్ష్మణ, కోశాధికారిగా గాలి శ్రీను, పెదిరెడ్ల గణేష్, మహిళా కమిటీ అధ్యక్షులుగా గోన్నాబత్తుల పాల్గున, ఉపాధ్యక్షులుగా పడాల భూలక్ష్మి, కార్యదర్శిగా సేనాపతి పద్మ, కోశాధికారిగా అద్దిపల్లి లక్ష్మి ఎన్నికయ్యారు. కొత్తగా ఎన్నికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గోన్నాబత్తుల శ్రీనివాసరావు, గాలి సూరిబాబు, ముమ్మనా సూర్యనారాయణ, సేనాపతి శ్రీనివాసరావు, మణికంఠ పాల్గొన్నారు.

ఆనకట్ట నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి -వడ్డాది : మండలంలోని మంగళాపురం వద్ద ఆనకట్ట నిర్మాణ పనులను ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు గురువారం పరిశీలించారు. ఆనకట్టకు గతంలో రూ.40 లక్షల ఎంపీ గ్రాంటుతో పనులు చేపట్టగా నిధుల కొరతతో నిర్మాణ పనులు అసంపూర్తిగా నిలిచిపోగా, దీనిని పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలని విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆనంద్‌కుమార్‌ను ఎమ్మెల్యే కోరగా, ఆయన రూ.7 లక్షలు విశాఖ డెయిరీ ట్రస్ట్ నుండి మంజూరు చేసిన విషయం విధితమే. నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే ఇరిగేషన్, విశాఖ డెయిరీ అధికారులతో మాట్లాడారు. రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, టిడిపి మండల నాయకులు జి.కోటేశ్వరరావు, తమరాన దాసు, వియ్యపు అప్పారావు, కోరుకొండ రవికుమార్, దొడ్డి కిషోర్, కోట సత్యనారాయణ, ఇరిగేషన్ జెఇ జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - యలమంచిలి : రాష్ట్రంలో చదువుకున్న ప్రతి యువతి, యువకులకూ ఉపాధి కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని యలమంచిలి శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ అన్నారు. స్థానిక గురజాడ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఏపి రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఏర్పాటు చేసిన నియోజకవర్గ స్థాయి మెగా జాబ్ మేళా కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఉద్యోగాల కల్పనలో భాగంగా 26 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 1556 ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రసాదరాజు, ఎంపిడిఓ కొండలరావు, తహశీల్దార్, కంపెనీల హెచ్ఆర్‌లు, నిర్వాహకులు ఊటకూటి రమేష్, కొఠారు శ్రీనివాసరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు సమ్మర్ అలవెన్స్ కల్పించాలి

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఉపాధి హామీ చట్టం కింద పనులు చేస్తున్న ఉపాధి హామీ కూలీలకు సమ్మర్ అలవెన్స్, సదుపాయాలు కల్పించాలని సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. కేపీ అగ్రహారంలో కోణం చెరువులో పని చేస్తున్న కూలీలను గురువారం ఆయన కలిసి మాట్లాడారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. వేసవి ఎండల దృష్ట్యా ఉపాధి శ్రామికులకు నీడ తాగునీరు సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రతిరోజు కనీస వేతనం రూ.307 వచ్చేలా పని కల్పించాలని, వేతన బకాయిలు సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

ఉచిత మొక్కల పంపిణీకి వివరాలు సేకరణ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : రైతులకు పిఎస్‌పి అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా ఉచితంగా మొక్కలు పంపిణీకి కేపీ అగ్రహారంలో గురువారం రైతుల నుండి వివరాలు సేకరించారు. సంస్థ ద్వారా ఉచితంగా మామిడి, జీడి, టేకు మొక్కలు అందిస్తారని సర్పంచ్ గోపిశెట్టి శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు తమ ఆధార్, వన్‌బి, ఫోటోలను ఈ నెల 19వ తేదీన తమకు అందించాలని కోరారు. ఎకరాకు 60 మొక్కలు వరకు అందిస్తారన్నారు.

'జనవాణి'లో పాల్గొన్న అధికారులపై చర్యలు తీసుకోవాలి

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ

ప్రజాశక్తి-మునగపాక : స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన జనవాణి కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక తహసిల్దార్ కార్యాలయం ఆవరణలో పార్టీ నాయకులతో కలసి గురువారం విలేకరులతో మాట్లాడారు. జనవాణి ప్రభుత్వ కార్యక్రమం అయితే దానిని ప్రభుత్వ కార్యాలయాల్లో నిర్వహించాలి తప్ప నిబంధనలకు విరుద్ధంగా పార్టీ కార్యాలయాల్లో ప్రభుత్వ అధికారులతో ఎలా నిర్వహించారని ప్రశ్నించారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు కానరాని అధికారులు అధికార పార్టీల కార్యాలయాల్లో నిర్వహించే కార్యక్రమాలకు వెళ్లి ప్రభుభక్తిని చాటుకుంటున్నారని విమర్శించారు. జనవాణి కార్యక్రమానికి వెళ్లాలని ప్రభుత్వం నుండి ఏ విధమైన ఆదేశాలు, ఉత్తర్వులు లేకపోయినా అధికారులు ఎమ్మెల్యే కూడా హాజరుకాని జనవాణి కార్యక్రమానికి వెళ్లడం దుర్మార్గమన్నారు. ప్రజల సమస్యల పట్ల నిజంగా చిత్తశుద్ధి ఉంటే బహిరంగ ప్రదేశాల్లో, ప్రభుత్వ కార్యాలయంలో ఇటువంటి కార్యక్రమాన్ని నిర్వహించాలని హితవుపలికారు. జిల్లా కలెక్టర్ వెంటనే జనవాణి కార్యక్రమానికి వెళ్లిన అధికారులందరికీ మెమోలు ఇవ్వాలని గనిశెట్టి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం నాయకులు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్.బ్రహ్మాజీ, ఎంవిఎస్.సత్యనారాయణ, టెక్కలి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం నాయకులు గనిశెట్టి సత్యనారాయణ

ఆర్థిక సంఘం నిధులు పూర్తిగా విడుదల చేయాలి

16వ సంఘం సమావేశంలో ఎంపిపి సూరిబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి : 16వ ఆర్థిక సంఘం నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని అనకాపల్లి ఎంపిపి గొర్లి సూరిబాబు విజ్ఞప్తి చేశారు. డాక్టర్ సౌమ్య క్రాంతి గౌస్ నేతృత్వంలో తిరుపతిలో గురువారం జరిగిన 16వ ఆర్థిక సంఘ కమిషన్ సమావేశానికి సూరిబాబు హాజరై మాట్లాడారు. 2011 లెక్కల ప్రకారం నిధులు మంజూరు చేయడం సబబు కాదన్నారు. అప్పటికీ ఇప్పటికి మండలంలో 45 వేలకు పైగా జనాభా పెరుగుదల ఉన్న నేపథ్యంలో అప్పటి లెక్కల ప్రకారం ప్రతి వ్యక్తికి రూ.117 మంజూరు చేసే వారని, ప్రస్తుత జనాభా ఆధారంగా రూ.900 చొప్పున సంవత్సరానికి రూ.11 కోట్ల అభివృద్ధి నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రధానంగా టైడ్ నిధులలో తాగునీరు, పారిశుధ్యానికి ప్రాధాన్యతనిస్తూ అత్యవసర పనులు వేగవంతం చేసుకోవాలన్నారు. అన్ టైడ్‌లో రోడ్లు కాలువల నిర్మాణం పనులు ఇతర వసతులు, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్ హాస్టల్ ఇతర వసతులు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. అన్నింటికీ పూర్తిగా కేంద్ర ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తుంది కనుక చేపట్టే పనులపై జిఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలని కోరారు. అత్యవసర నిధులు, తక్షణ అభివృద్ధి తదితర అంశాలపై మన ప్రాంతాల్లో ఉన్న ఇబ్బందులపై అవకాశం రావడంతో అన్ని వివరించడం జరిగిందని ఎంపీపీ సూరిబాబు తెలిపారు.



వినతిపత్రం ఇస్తున్న ఎంపిపి సూరిబాబు

ఇరిగేషన్ ఛానల్స్ మరమ్మతులకు రూ.2.87 కోట్లు

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో ఇరిగేషన్ ఛానల్స్ మరమ్మతులకు రూ.2.87 కోట్లు మంజూరైనట్లు అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం ఇరిగేషన్ శాఖ డీఈ స్వామి నాయుడు, ఏఈ అమూల్యతో ఆయన సమావేశమై మాట్లాడారు. అనకాపల్లి పట్టణం, అనకాపల్లి, కశింకోట మండలాల్లో వున్న ఓ అండ్ ఎం పనులు కింద డిసిల్టింగ్, నీటి సంఘాల ద్వారా కాలువలు చెరువులు అభివృద్ధికి నిధులు మంజూరైనట్లు చెప్పారు. కసింకోట కాశీ మధుం ఛానల్‌కి రూ.9 లక్షలు, పేరంటాలపాలెం ఛానల్‌కి రూ.6లక్షలు, సీతానగరం ఛానల్‌కి రూ.10 లక్షలు, తగరంపూడి ఛానల్‌కి రూ.10 లక్షలు, వెదురుపర్తి ఛానల్‌కు రూ.6 లక్షలు, తుమ్మపాల ఛానల్‌కి రూ.10 లక్షలు, మాకవరం ఎర్రి నాయుడు ఛానల్‌కి రూ.10 లక్షలు, సంతపాలెం వీరన్న ట్యాంకుకు రూ.10 లక్షలు, సిహెచ్ఎన్ అగ్రహారం ధర్మసాగరం ట్యాంకుకు రూ.10 లక్షలు, బట్లపూడి ఎరకన్న దొర ట్యాంక్‌కు రూ.10 లక్షలు, రేబాక పూర ట్యాంకుకి రూ.9 లక్షలు, మొత్తం కోటి రూపాయలు నిధులు మంజూరైనట్లు తెలిపారు. అలాగే అనకాపల్లి జీవీఎంసీ పరిధిలో ఉన్న 11 మురుగు నీరు కాల్వల్లో డిసిల్టింగ్ చేయటానికి రూ.50.25 లక్షలు, పులి కాలవకు రూ.28లక్షలు, వెదుళ్ళ గడ్డ చింతనిప్పుల అగ్రహారంకు రూ.29.30 లక్షలు, పోతుకొండ గెడ్డ కొండుపాలెం గ్రామానికి రూ.18.20లక్షలు, కొప్పాక గైరమ్మ గెడ్డకు రూ.6లక్షలు, దిబ్బపాలెం చెర్లోపలి ఛానల్‌కు రూ.9.95లక్షలు, అనకాపల్లి టౌన్ చెర్లోపలి ఛానల్‌కు రూ.9.90లక్షలు, తుమ్మపాల ఎల్లయ్య ఛానల్‌కు రూ.9.95 లక్షలు, అనకాపల్లి టౌన్ ఎల్లయ్య ఛానల్‌కు రూ.10లక్షలు, మొత్తం కోటి 37 లక్షల నిధులు మంజూరైనట్లు వెల్లడించారు. ఎస్టిమేషన్లు వేసి పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

రోడ్డు విస్తరణకు సహకరించాలి

ఎపిఐఐసి, ఎంఎస్ఎంఇ పార్కు రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన విఎంఆర్‌డిఎ కమిషనర్

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని పైడివాడ అగ్రహారం, అసకపల్లి, లంకెలపాలెం రోడ్డు నుండి అనకాపల్లి జిల్లా కోడూరులో ఏర్పాటు కానున్న ఏపీఐఐసి ఎంఎస్ఎంఈ పార్కుకు నిర్మిస్తున్న వందడుగుల రోడ్డు విస్తరణ పనులను వీఎంఆర్‌డిఎ కమిషనర్ కెఎస్ విశ్వనాథన్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2.68 కిలోమీటర్ల పొడవున 100 అడుగుల రోడ్డుకు సుమారు 12.263 ఎకరాల భూమి అవసరం ఉందని తెలిపారు. ఈ భూమిని రైతుల నుండి సేకరించినట్లు తెలిపారు. భూమి కోల్పోయిన రైతులకు విఎంఆర్‌డిఏ ద్వారా టిడిఆర్ బాండ్లు జారీ చేస్తారని తెలిపారు. ఈ రోడ్డు వలన ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. చిన్నచిన్న పరిశ్రమల ఏర్పాటుకు కోడూరులో ఆటోనగర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. ఈ రోడ్డు విస్తరణ పూర్తయితే ఈ ప్రాంతం ఇంకా అభివృద్ధి చెందుతుందని, ఇక్కడ ప్రజలు రైతులు ఈ రోడ్డు విస్తరణ కు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సబ్బవరం తహశీల్దారు బి.చిన్నకృష్ణ, మండల సర్వేయర్ అప్పారావు, ఆర్ఐ వీరయ్య, విఆర్ఓ దేముడుబాబు, వీఎంఆర్డీఏ అధికారులు, ఎంపీటీసీ సీరం అప్పలరాజు, మాజీ ఎంపీటీసీ అక్కిరెడ్డి రామలక్ష్మి దుర్గి నాయుడు, బొబ్బర మహేష్, అమ్మతల్లి, సత్యారావు, సన్యాసినాయుడు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

న్యాయమూర్తులను కలిసిన ఎస్‌పి

ప్రజాశక్తి-చోడవరం : చోడవరం కోర్టు సముదాయాన్ని సందర్శించిన అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా గురువారం చోడవరం కోర్టులో 9వ అదనపు జిల్లా జడ్జి కె.రత్నకుమార్, విశాఖపట్నం, 4వ అదనపు జిల్లా జడ్జి ఎం.నాగేశ్వరరావులను గురువారం మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా, జిల్లా పరిధిలో ఇటీవల వెలుగు చూసిన గంజాయి అక్రమ రవాణా కేసులు, హత్యల వంటి ప్రధాన నేరాల వివరాలను ఎస్పీ న్యాయమూర్తులకు తెలియజేసి, వాటి నియంత్రణకు పోలీసులు చేపట్టిన చర్యలను వివరించారు. నేరాలను నియంత్రించడంలో న్యాయ, పోలీస్ వ్యవస్థలు సమన్వయంతో వ్యవహరించడం ఎంతో అవసరమని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సీఐ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో ట్రాఫిక్ నియంత్రణ

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : ట్రాఫిక్ నియంత్రణకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వాడాలని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా అన్నారు. అనకాపల్లి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ట్రాఫిక్ నియంత్రణ అధికారులతో చర్చించారు. ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజలకు కనిపించేలా విజిబుల్‌గా ఉండాలని ఆదేశించారు. వాహనాల రద్దీ నివారణకు పట్టణంలో అనువైన పార్కింగ్ స్థలాలను గుర్తించాలని సూచించారు. రోడ్డు భద్రతను మెరుగుపరచడంలో భాగంగా, సైన్‌బోర్డులు ఏర్పాటు చేయడం, వెలుతురు లేని ప్రాంతాల్లో సరైన లైటింగ్ ఏర్పాటు చేయడం, ప్రధాన జంక్షన్ల వద్ద మైక్‌ల ద్వారా హెచ్చరికల పంపిణీ చేయడం వంటి చర్యలను వెంటనే అమలు చేయాలని సూచించారు. ముఖ్య జంక్షన్లలో సీసీటీవీ కెమెరాలు అమర్చాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటనారాయణ, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ బాల సూర్యారావు, ఎస్సై శేఖరం, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ పండగ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని సిరసపల్లి పంచాయతీ పరిధి రామారాయుడుపేట గ్రామంలో మరిడిమాంబ అమ్మవారి పండగ గురువారం ఘనంగా జరిగింది. మాజీ శాసనసభ్యులు కరణం ధర్మశ్రీ, వైకాపా రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాదు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూతనంగా నిర్మించిన సీతారాముల ఆలయాన్ని వారు దర్శించుకున్నారు. కార్యక్రమంలో వెంకటాపురం గ్రామ సర్పంచ్ సుందరపు తాతాజీ, గ్రామ పెద్దలు, ఆలయ నిర్వాహకులు పాల్గొన్నారు.

లాఫింగ్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-అనకాపల్లి : లాఫింగ్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం జరిగింది. కొణతాల పూర్ణచంద్ర ఆధ్వర్యంలో లాఫింగ్ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు వివి.బుచ్చిరాజు, అధ్యక్షులు దాడి వాసు సమక్షంలో పరమేశ్వరి పార్క్, సెంటర్లో సోదర సంక్షేమ సమితి ఆఫీసులో నూతన కార్యవర్గ సభ్యులను పరిచయం చేశారు. లాఫింగ్ క్లబ్ అధ్యక్షులుగా విల్లూరి వీర సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులుగా బుద్ద ప్రవీణ్, కార్యదర్శిగా కోరిబిల్లి ఆరుద్ర, సహాయ కార్యదర్శులుగా బుద్ద జగదీష్, కోరిబిల్లి యుగంధర్, కోశాధికారిగా డివైడీపీ సతీష్, బొడ్డేడ స్వామి, పెంటకోట చంద్రరావు, కార్యవర్గ సభ్యులుగా 12 మంది ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వపు అధ్యక్షులు జగన్మోహన్‌రావు, మాజీ సహాయ కార్యదర్శి దాడి స్వామి నాయుడు, బొడ్డేడ మురళి పాల్గొన్నారు.

సిజెగా గవాయి నియామకంపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : భారత సుప్రీం కోర్టు 52వ ప్రధాన న్యాయమూర్తిగా తొలి బౌద్ధుడు జస్టిస్ భూషణ్ రామకృష్ణ గవాయిను నియమించడం పట్ల సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షులు బల్లానాగభూషణం గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

మోదమ్మ జాతర ఏర్పాట్లపై సమీక్ష



అధికారులతో సమీక్షలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

ప్రజాశక్తి- మాడుగుల : అందరి సహకారంతో వచ్చేనెల 3న నిర్వహించే మాడుగుల మోదకొండమ్మ జాతరను విజయవంతం చేయాలని, ఏర్పాట్లులో ఎటువంటి లోపం లేకుండా సమన్వయంతో పనిచేయాలని స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి అన్నారు.గురువారం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో మోద కొండమ్మ జాతర ఏర్పాట్లుపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది జూన్ 3, మంగళవారం మాడుగుల మోదకొండమ్మ జాతర జరిపేందుకు కమిటీ సభ్యులు తీర్మానం చేశారన్నారు. జాతరకు ఉత్తరాంధ్ర జిల్లా నుండే కాకుండా రాష్ట్ర నలుమూలల నుండి అత్యధిక సంఖ్యలో భక్తులు ప్రజలు తరలి వస్తారని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, ఇబ్బందులు తలెత్తకుండా జాతరకు వచ్చే వారికి అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు. ముఖ్యంగా పారిశుధ్య సమస్య తలెత్తకుండా పంచాయతీ సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు తాగునీటికి ఇబ్బందులు రాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. అవసరమైనచోట్ల మెడికల్ క్యాంపులను నిర్వహించేందుకు వైద్యసిబ్బంది చర్యలు చేపట్టాలనానరు. జాతరలో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా చూడాలని ఆ శాఖ అధికారులను ఆదేశించారు. అగ్నిమాపక వాహనాన్ని సిద్ధంగా ఉంచాలని,. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. మాడుగుల మోదమ్మ జాతర నేపథ్యంలో వచ్చేనెల ఒకటి నుంచి 5వ రకు మాడుగులకు ప్రత్యేక బస్ సర్వీసులు నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. సమీక్షకు ఆర్టీసీ అధికారులకు సమాచా జాతర సందర్భంగా వడ్డాది నుండి ఘాట్‌రోడ్ జంక్షన్ వరకు రోడ్డు పనులు జరుగుతున్న కారణంగా ఎక్కడ ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఒ, తహసిల్దార్, ఇతర శాఖల అధికారుల సాయం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎడ్ల కళావతి, ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ రాజారాం, టిడిపి మండల అధ్యక్షులు అద్దేపల్లి జగ్గారావు ఎంపిడిఒ కొంకి అప్పారావు, తహసిల్దార్ కె రమాదేవి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎంసెట్ హాల్ టిక్కెట్ల పంపిణీ



ఎంసెట్ హాల్ టిక్కెట్స్ అందజేస్తున్న ఎఎస్‌పి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : ఎస్ఎఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఛారిటీ ఆధ్వర్యంలో ఎస్.కృష్ణ సహకారంతో ఎంసెట్ ఉచిత కోచింగ్ తీసుకున్న విద్యార్థులకు గురువారం హాల్‌టిక్కెట్లను అందజేశారు. నర్సీపట్నం, పరిసర గ్రామాలు, ఏజెన్సీ గ్రామీణ పేద విద్యార్థులకు ఐదేళ్లుగా ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇస్తున్న ఎస్ఎన్ సొసైటీ ఈ ఏడాది కూడా 300 మంది పేద విద్యార్థులు రెండు నెలల ఉచిత ఎంసెట్ కోచింగ్ ఇచ్చింది. ఈనెల 21న ఎంసెట్ పరీక్ష జరగనున్న నేపథ్యంలో శిక్షణ పొందిన విద్యార్థులకు నర్సీపట్నం ఎఎస్‌పి శ్రీనివాసరావు హాల్ టికెట్స్ అందజేశారు.. ఈ సందర్భంగా ఎఎస్‌పి మాట్లాడుతూ విద్యార్థులు బాగా పరీక్ష రాసి మంచి ర్యాంకు సాధించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు ఎదగాలని, క్రమశిక్షణతో ఉండాలని ఆకాంక్షించారు. ఎస్ఎఎన్ ఎడ్యుకేషనల్ సొసైటీ, ఛారిటీ ఏజెన్సీ గిరిజనులు, పేదలకు అందిస్తున్న సేవలను కొనియాడారు. సొసైటీ అధినేత సూరెడ్డి అప్పలనాయుడుకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎస్ ఉమామహేశ్వరి, శివ, వంశీ పాల్గొన్నారు.

దంచి కొట్టిన వర్షం



కోటవురట్లలో రోడ్డుపైకి భారీగా చేరిన వర్షపునీరు

ప్రజాశక్తి- కోటవురట్ల :మండలంలో గురువారం వివిధ ప్రాంతాలలో వర్షం దంచి కొట్టింది, సుమారు గంట పాటు కురిసిన వర్షంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి, మండల కేంద్రంలో మండల పరిషత్ సమీపం లో గల ఆర్అండ్‌బి రోడ్డు జలమయం కావడంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. విద్యుత్తుఅంతరాయం ఏర్పడింది, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు పడ్డారు, చినుకు పడితే చాలు విద్యుత్తుకు అంతరాయం ఏర్పడుతుందని వినియోగదారులు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

మాడుగుల: మండలంలోని గురువారం ఉరుములు మెరుపులు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పలుచోట్ల విద్యుత్ స్తంభాలపై చెట్లు విరిగిపడ్డాయి. దీంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. పలు గ్రామాలు అంధకారంలోనే ఉండిపోయాయి.

ఊరించిన మేఘాలు

నక్కపల్లి: ఆకాశంలో నలగురువారం సాయంత్రం 3 గంటల సమయంలో ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. వర్షం కురుస్తుందని, వాతావరణం చల్లబడుతుందని, ఉపశమనం పొందవచ్చునని అంతా భావించారు. అయితే నింగిలో మేఘాలు సందడి చేశాయే తప్ప, వరుణుని కరుణ లేక జనం నిరాశ చెందారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి : ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని పంచాయతీ గ్రామాలలో మూడు చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఎంపిడిఒ డి సీతారామరాజు సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విపత్తుల నిర్వహణ శాఖ సూచనల మేరకు ఎండ తీవ్రత, వడగాల్పులపై జాగ్రత్తలను వివరిస్తూ ప్రజలను అప్రమత్తం చేయాలని, వాతావరణ శాఖ హెచ్చరికల యాప్ డౌన్‌లోడ్ చేయించాలని సూచించారు. సంపద తయారీ కేంద్రాల వద్ద మొక్కలు నాటాలన్నారు. శనివారం నిర్వహించనున్న స్వర్ణ ఆంధ్ర ,స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. ఇంటిపన్నుకు ఆధార్ సీడింగ్ త్వరతగతిన పూర్తి చేయాలన్నారు. ఇంచార్జ్ ఇఒపిఆర్‌డి ఎం శ్రీను పాల్గొన్నారు.

విశ్వకర్మ మహా యజ్ఞానికి సహకరించండి



స్పీకర్ అయ్యన్నకు ఆహ్వానపత్రిక ఇస్తున్న సంఘ ప్రతినిధులు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ : రాష్ట్ర రాజధాని అమరావతి పునర్నిర్మాణం నిరాటంకంగా సాగాలనే సత్సంకల్పంతో 'విరాట్ విశ్వకర్మ మహాయజ్ఞం' అనే క్రతువును మూడు రోజులపాటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించాలనే ఆకాంక్షను పలువురు వ్యక్తం చేశారు. గురువారం శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడును ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంఘానికి చెందిన పంచాయలు, ఉద్యోగ, వ్యాపార, పురోహిత సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి, కార్యక్రమ వివరాలను వివరించారు. యజ్ఞం నిర్వహణకు అవసరమైన అనుమతులు, స్థలం, సమయం తదితరాలు కేటాయించేందుకు ముఖ్యమంత్రిని కలిసేందుకు అవకాశం కల్పించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై స్పీకర్ అయ్యన్న సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి తగిన ఏర్పాట్లు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ సంఘ పెద్దలు వేముల కన్న ప్రసాద్, బేతాళ సన్యాసిరావు, అలుగోలు సత్యరావు, పూడి సురేష్, చిట్టూరి కృష్ణ, పెదపాటి శరత్, పాటోజు బ్రహ్మజీ పాల్గొన్నారు.

రుణాలిచ్చి రైతులకు ఆసరాగా నిలవాలి



మాట్లాడుతున్నలీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ

ప్రజాశక్తి- కోటవురట్ల : రైతులు, కౌలు రైతులను బ్యాంకర్లు ఆదరించినట్లయితే గ్రామీణ ప్రాంతాల్లో విస్తరిస్తున్న చిన్న తరహా వడ్డీ వ్యాపారస్తులను,వారు ఆశ్రయించే అవసరం ఉండదని లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో కోటవురట్ల మాకవరపాలెం నాతవరం మండలాల బ్యాంకర్ల తో సమావేశంలో మాట్లాడుతూ, రైతులకు కౌలు రైతులకు సకాలంలో రుణాలు మంజూరు చేయాలని, అదే విధంగా చిన్న తరహా పరిశ్రమలకు బ్యాంకర్ల కొమ్ముకాయాలన్నారు. తద్వారా బ్యాంకులు అభివృద్ధి పథంలో పయనించడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకర్లపై విశ్వాసం కలుగుతుందని సూచించారు, వ్యవసాయ పరికరాలకు సబ్సిడీపై రుణాలు అందించే విషయంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని సూచించారు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహనరావు మాట్లాడుతూ రైతులకు సకాలంలో రుణాలు అందజేయాలని కౌలు రైతులకు కిసాన్ క్రెడిట్ కార్డులు అందజేయాలని బ్యాంకర్లను కోరారు, కార్యక్రమంలో ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు వివిధ మండలాల బ్యాంకు అధికారులు వ్యవసాయ శాఖ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

52 వేల హెక్టార్లలో వరి సాగుకు సన్నద్ధం

కోటవురట్ల: రానున్న ఖరీఫ్ సీజన్‌లో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వరి విత్తనాలు జూన్ నెలలో అందుబాటులో ఉంచుతామని 52 వేల హెక్టార్లలో వరిపంట, ఆరువేల హెక్టార్లలో చెరకు సాగు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు వ్యవసాయశాఖ ఎడి ఉమా ప్రసాద్, ఎఒ సరోజిని తెలిపారు, రైతులకు, కౌలు రైతులకు వడ్డీ లేని రుణాలు అందించేందుకు బ్యాంకులను కోరామని అదే విధంగా సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు, రైతులకు క్రిమిసంహారక మందులు పిచికారి చేసే డ్రోన్‌ను సబ్సిడీపై మండలానికి ఒకటి ఇస్తామన్నారు. ఖరీఫ్ సీజన్‌కు ముందుగానే అన్నదాత సుఖీభవ రైతులకు అందించే విధంగా ఆన్లైన్ ప్రక్రియ జరుగుతుందని అర్హత కలిగిన రైతులంతా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు, రీసర్వే గ్రామాల్లో తలెత్తిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించుకోవాలని రైతులకు సూచించారు అనంతరం సిబ్బందితో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు.

రావికమతం: మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ శాఖ, వ్యవసాయ శాఖ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలోని రైతు సేవా కేంద్రాల ఇన్‌ఛార్జిలు, విఆర్‌ఒలతో వ్యవసాయ శాఖ అధికారిని డి.రూప ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో తహశీల్దార్ బి.వెంకటరమణ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో కౌలు రైతులందరికీ అందరిని గుర్తించి వారికి సాగు హక్కు పత్రాలను అందజేయాలన్నారు. అన్నదాత సుఖీభవ ఎపిఎఫ్ఐఆర్ఎస్ కౌలు రైతులకు హక్కు పత్రాలను అందజేసేందుకు ప్రణాళికలు చేసుకోవాల న్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణా శిబిరాలు



నర్సీపట్నంలో పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్న విద్యార్థులు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారిణి దమయంతి ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్ జి హైమావతి విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ వ్యాకరణంపై అవగాహన కల్పించారు. విద్యార్థులతో శతకాలు , పద్యాలు చదివించి అర్థాలను వివరించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పి. కనకరాజు వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో ఇప్పటివరకు నిర్వహించిన కార్యక్రమాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. .విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు ప్రభాకర్ దురాశ దుఃఖానికి చేటు అనే నీతి కథలు వినిపించి వివరించారు. వ్యాయామ ఉపాధ్యాయుడు పి. ప్రభాకర్ ప్రపంచ కుటుంబ దినోత్సవం ప్రత్యేకతను వివరించి, కుటుంబంలో ఉన్న ప్రతి ఒక్కరి స్థానం విలువైనదని, ఎవరి బాధ్యత వారు నిర్వహించాలని , తల్లిదండ్రులను గౌరవించాలని తెలిపారు. సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు కాటన్ అందించిన సేవలను వివరించారు. గోదావరినదిపైన ధవళేశ్వరం వద్ద కాటన్ బ్యారేజీ కోనసీమ అన్నదాతలకు ఎలా అండగా నిలిచిందో వివరించారు.

విద్యార్థులకు కథలు పోటీలు

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు కథలు పోటీలు నిర్వహించారు. రెండు రోజులుగా విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన నీతి కథలను నేర్పించి, కథలు పోటీలు పెట్టారు. పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంతో ఈ పోటీల్లో పాల్గొన్నారు.



నక్కపల్లిలో కథల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పాలిసెట్ ఉత్తమ ర్యాంకర్లకు అభినందన


విద్యార్థికి స్వీట్ తినిపిస్తున్న సిఆర్‌పి

ప్రజాశక్తి -కొత్తకోట : రావికమతం మండలం కొత్తకోట, టి. అర్జాపురం గ్రామాలకు చెందిన భీమరాతి వెంకట కిషోర్, డొంక సాయి లోకేష్ రాష్ట్ర స్థాయిలో పాలిసెట్ లో మంచి ర్యాంక్ లు సాధించారు. బుధవారం సాయంత్రం వెలువడిన ఫలితాలలో కొత్తకోట గ్రామానికి చెందిన భీమ రాతి వెంకట్ కిషోర్ 120 మార్కులకు గాను 112, సాధించగా, టి అర్జాపురానికి చెందిన డొంక సాయిలోకేష్ 109 మార్కులు సాధించారు. వెంకట్ కిషోర్ రాష్ట్ర స్థాయిలో 1097 ర్యాంక్ సాధించగా, సాయి లోకేష్ రాష్ట్ర స్థాయి లో 1775 ర్యాంక్ సాధించా డు. కొత్తకోట పిఎస్ఆర్ జిల్లా పరిషత్ పాఠశాల లో చదివిన విద్యార్థి వెంకట్ కిషోర్ ఇటీవల పదవ తరగతి పరీక్షలలో 566 మార్కులు సాధించాడు.అలాగే టి. అర్జాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో చదివిన విద్యార్థి సాయి లోకేష్ కూడా పదవ తరగతి పరీక్షలలో 566 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానాలలో నిలిచారు.. రాష్ట్ర స్థాయిలో ర్యాంక్‌లు సాధించిన వెంకట్ కిషోర్, డొంక సాయి లోకేష్ ను సి ఆర్ పి గుంటూరు రామా రావుతో పాటు కొత్త కోట, టి అర్జా పురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కె. నాగేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థి తల్లి తండ్రులు, గ్రామస్తులు అభినందించారు

20 రోజులుగా అంధకారంలోనే..

పాడైన ట్రాన్స్‌ఫార్మర్‌ను పట్టించుకోని అధికారులు

అవస్థలు పడుతున్న గదబపాలెం గిరిజనం


పాడైన సింగిల్ ఫేజ్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

ప్రజాశక్తి -రావికమతం : మండలంలోని పులకంఠం పొన్నవోలు పంచాయతీ శివారు గదబపాలెం గ్రామంలో 20 రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గిరిజనులు నానా అవస్థలు పడుతున్నారు. గ్రామంలో ఉన్న చిన్నపాటి విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ మరమ్మతలకు గురైన విషయాన్ని సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేసి నప్పటికీ, సమస్య పరిష్కరించ డంలో ఇవాళ రేపు అంటూ కాలం వెల్ల తీస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ సౌకర్యం లేక తాము పడుతున్న ఇబ్బందులపై జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామని గ్రామ గిరిజనులు ఇంగిలపు దేముడు, నల్లి కాశీ మజ్జి దేముడు, గోరా శ్రీను, నల్లి కల్యాణం, దేముడు తెలిపారు.


ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- మాడుగుల : మండలంలో ఒంటర్లపాలెం గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి సాగు వివరాలను సూచించారు. ఖరీఫ్‌కు ముందస్తుగా పచ్చిరొట్ట విత్తనాలను వేయడం ద్వారా నేలలో పోషక, జీవవైవిద్యం, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని సూచించారు. పంటలలో చీడపీడలను,తెగుళ్ల తగ్గడమే కాకుండా వాతావరణ వైపరీత్యాలను తట్టుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుందని అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయ సాగుపై అవగాహన కల్పించేందుకు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.ఉత్తమ రైతులకు సన్మానం చేశారు కార్యక్రమంలో సర్పంచ్ అల్లాడి నాగేశ్వరావు,ఎంపిటిసి నాగరత్నం, వివిఎ మంగరాజు, విఒఎ కుమార్ రాజు, ఎంటి దేవి, మెడికల్ మేకర్ కొండాజి,ఎల్ టు సన్యాసిరావు ప్రకతి వ్యవసాయ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న వివిఎ

దృశ్య కావ్యంలా సంఘం శరణం గచ్ఛామి


● అంబేద్కర్ జీవిత సన్నివేశాలతో ఆకట్టుకున్న నాటక ప్రదర్శన



సంఘం శరణం గచ్ఛామి నాటకంలో కీలకమైన సన్నివేశాలు

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : కెవిపిఎస్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ ఆకాడమీ కళాకారులతో నర్సీపట్నం సిటీ క్లబ్‌లో బుధవారం రాత్రి ప్రదర్శించిన 'సంఘం శరణం గచ్ఛామి' నాటకం ఆకట్టుకుంది. కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి అధ్యక్షతన నాటకం ప్రారంభానికి ముందుగా అంబేద్కర్ చిత్రపటానికి నర్సీపట్నం ఎంఇఒ సిహెచ్ తలుపులు, టి.విజయకుమార్ ,సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.కోటేశ్వర రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అభ్యుదయ నాటక బృందం ఆంధ్రా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలలో తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో ఈ నాటకాన్ని ఇప్పటివరకు 800 ప్రదర్శనలు ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎంఇఒ తలుపులు మాట్లాడుతూ అంబేద్కర్ జీవితం నేటితరానికి ఆదర్శనీయమని, ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు నాటకంలో అన్ని సన్నివేశాలు వాస్తవికతను ప్రతిబింబించేలా ఉండడంతో ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయన్నారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దృశ్య కావ్యంలా సాగిన నాటక ప్రదర్శనలో పలు దృశ్యాలకు ప్రేక్షకులు కన్నీటిపర్యంతం అయ్యారు. అంబేద్కర్ బాల్యం, విద్యాభ్యాసం, వివాహం, నిమ్నజాతుల హక్కుల కోసం చేసిన పోరాటాలు, రాజ్యాంగ రచనతో పాటు దేశ సేవలను ఈ నాటకంలో ప్రదర్శించారు. నాటకంలో చేసిన కళారూపాలు ప్రజలను ఆకట్టుకున్నాయి.కార్యక్రమంలో జనవ విజ్ఞానవేదిక రాష్ట్ర నాయకులు కె. త్రిమూర్తులు రెడ్డి, యుటిఎఫ్ సీనియర్ నాయకలు ఎం చిట్టియ్య, ప్రభుదాస్, విశ్రాంత ఆచ్యారులు యలమంద కోటేశ్వరరావు, విజయకుమార్ పాల్గొన్నారు.


నాటకంలో ఆసక్తికర సన్నివేశం


అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాలనేతలు, అధికారులు

పిడుగుపాటుకు 30 మూగజీవాలు మృత్యువాత

ప్రజాశక్తి-రావికమతం : మండలంలో గురువారం మధ్యాహ్నం ఈదురు గాలులతో కూడిన వర్షంతోపాటు పిడుగులు పడడంతో 30 మూగజీవాలు మృతి చెందాయి. మండల కేంద్రంలోని శెట్టి వారి కల్లాల వద్ద ^ు మరుపాక, అగ్రహారం గ్రామాలకు చెందిన యాదవులు గొర్రెలను, మేకలను, మేతకు తీసుకురాగా, అక్కడ పిడుగు పడడంతో 30జీవాలు అక్కడకక్కడే మృతి చెందాయి. మరుపాక గ్రామానికి చెందిన సీర సాంబడు, నమ్మి వెంకటస్వామి, సిరా రమణ, దేవర అప్పలనాయుడు, అలాగే కే బి పీ అగ్రహారం గ్రామానికి చెందిన దేవర అప్పారావులకు చెందిన సుమారు 30 మేకల, గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందడంతో వాటి పెంపకమే జీవనాధారంగా ఉన్న ఆయా కుటుంబాలు తీవ్రంగా నష్టపోయామని బాధితులు లబోదిబో మంటున్నారు .సుమారు 3 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిలినట్లు అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం తక్షణ సహాయం అందించాలని బాధిత రైతులు కోరుతున్నారు. కాగా పిడుగుపాటు స్థలానికి చోడవరం ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆదుకుంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


పిడుగుపాటు బాధిత పెంపకందారులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రాజు

రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాల్సిందే.!

● తమ్మయ్యపేట సభలో నాయకులు, నిర్వాసితుల డిమాండ్


ప్యాకేజీపై నినాదాలు చేస్తున్న నాయకులు, నిర్వాసితులు

ప్రజాశక్తి -నక్కపల్లి : వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో ఇళ్లు కోల్పోతున్న నిర్వాసిత కుటుంబాలలో 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ రూ.25 లక్షలు ప్యాకేజీ చెల్లించాలని, నిర్వాసితులను అన్ని విధాల ఆదుకోవాలని నాయకులు, నిర్వాసితులు డిమాండ్ చేశారు. గురువారం మండలంలోని చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో తళ్ళ భార్గవ్ అధ్యక్షతన భూసేకరణ ప్రభావిత గ్రామాల నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైసిపి నేత వీసం రామకృష్ణ, ఎంపిటిసి సభ్యులు గంటా తిరుపతిరావు తదితర నాయకులు పాల్గొని మాట్లాడారు. నిర్వాసితులకు పూర్తిస్థాయిలో ప్యాకేజీ ప్రకటించకుండా ప్రభుత్వం కారిడార్ పనులు చేపట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. ఇది నిర్వాసితులను నిలువునా మోసగించడమే అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు .ఇల్లు కోల్పోతున్న కుటుంబాలలో 18 ఏళ్లు నిండిన వారికి రూ. 8.36 లక్షల ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించిందని, దీనిని అంగీకరించే ప్రసక్తేలేదని ముక్తకంఠంతో తేల్చి చెప్పారు. 2013 భూసేకరణ చట్టం వచ్చినప్పుడే రూ.5 లక్షలు ప్యాకేజీ ప్రకటించారని, చట్టం వచ్చి 12 ఏళ్లు అవుతుందని, ప్రస్తుతం అన్ని రకాల ధరలు పెరిగిన తరుణంలో 8 లక్షల 36 వేలు ప్యాకేజీ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. భూములు ఇచ్చేందుకు ఈ ప్రాంత రైతాంగానికి ఇష్టం లేదని, అయినప్పటికీ ప్రభుత్వం ఒత్తిడి మేరకు భూములు ఇచ్చేందుకు ముందుకు వచ్చారని, వారి త్యాగాన్ని పరిగణలోకి తీసుకొని రూ.25 లక్షల ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు.

పరిశ్రమలు ఏర్పాటుతో ఉపాధి కోల్పోనున్న రైతుల భూములపై ఆధారపడి జీవనం సాగిస్తున్న కూలీలు, వివిధ వృత్తిదారులు, సముద్రమే జీవనాధారంగా జీవిస్తున్న మత్యకారుల కుటుంబాలలోనూ 18 ఏళ్లు నిండిన వారికి రూ.15 లక్షల ప్యాకేజీ చెల్లించాలని డిమాండ్ చేశారు. డి ఫారం, సాగు భూముల్లో గల చెట్లకు నష్ట పరిహారం చెల్లించాలని, ప్రతి కుటుంబానికి ఆర్ కార్డులు మంజూరు చేసి స్థానికంగా ఏర్పాటు చేయు కంపెనీలలో పర్మినెంట్ ఉద్యోగాలు ఇవ్వాలన్నారు నిర్వాసితులు సమస్యలు పరిష్కారం చేయడానికి ముందుకు రాని ప్రభుత్వం బల్క్ డ్రగ్స్ పార్క్, ఆర్సిలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కు భూములు కేటాయింపు చేయడం, మిట్టల్ స్టీల్ప్లాంట్ క్యాప్టివ్‌పోర్ట్ ఏర్పాటు చేసుకోవడానికి ఏప్రిల్ 3 న రాష్ట్ర మంత్రివర్గం ఆగమేఘాల మీద అనుమతులు ఇవ్వడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ప్రభుత్వం రైతుల వద్ద భూములను తీసుకొని,కార్పొరేట్ కంపెనీలకు అప్పగించాలని ప్రభుత్వం చూస్తుందే తప్పా.. భూములు, జీవితాలు ,ఉపాధిని త్యాగం చేస్తున్న నిర్వాసితులను ఆదుకోవడానికి ముందుకు రాకపోవడం అన్యాయమన్నారు..జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి నిర్వాసితులతో జాయింట్ మీటింగ్ నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రేబాక సర్పంచ్ సాదిరెడ్డి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు జి గోవిందరావు, వి.నూకరాజు, పి. శ్రీనివాసరావు, కె.దారబాబు, చిన్న, శ్రీనివాసరావు, ప్రసాద్, పి.స్వామి, ఆర్.చిన్నాయుడు, సుబ్బారావు, నరసింహమూర్తి, ఈశ్వరరావు పాల్గొన్నారు.